జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 14 పక్షపత్రిక జులై 16-31, 2016




## అమెరికా, ఈయూ సైరన్లు - నిద్రమత్తు భారత్‌కు సంస్కరణల శంఖారావాలు

## పేద విద్యార్థికి లోక్‌సత్తా ఆర్థిక సాయం



ఐఐటీ-చెన్నైలో ఎంటెక్‌లో సీటు వచ్చి డబ్బులు కట్టలేని మాతృస్వామి అనే పేద విద్యార్థికి శనివారం లోక్‌సత్తాపార్టీ తరపున జయప్రకాశ్‌నారాయణ సాయం అందించారు. పార్టీ నిధి నుంచి రూ.40వేలు ఆర్థిక సహాయం అందించారు.

- న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ

**Bhushan Reddy** added 2 new photos — with **Pavan Reddy** and **18 others**.
Jun 23, 2013 at 10:48am ·

My junior in school and college Mr. A.M. Swamy **Swamy Amgoth** upon securing admission in IIT - Madras for M-tech Programme approached Dr.JP Garu MLA, Kukatpally for financial assistance to pursue his studies. Dr. JP responded immediately and sanctioned Rs 40,000/- towards the initial semester fee and promised for further assistance as the time progresses. He said ' No student in this country should be devoid of education due to lack of money' and wished him all the very best for his studies...We are thankful to our beloved MLA who is a people's man.

# మాతృస్వామిలాంటి మాణిక్యాలను వెలికితీసే విద్యావ్యవస్థ కావాలి : జేపీ

ఐఐటీ-చెన్నైలో ఎంటెక్ సీటు వచ్చి డబ్బులు కట్టలేని పరిస్థితితుల్లో ఉన్న ఎ. మాతృస్వామి అనే యువకుడు 2013లో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను కలిసి సాయం కోసం అభ్యర్థించారు. వెంటనే స్పందించిన జేపీ... మొదటి సెమిస్టర్ ఫీజు రూ.40,000ను ఆర్థిక సహాయంగా పార్టీ ఫండ్ నుంచి అందచేశారు. ముున్ముందు తగిన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. 'డబ్బు లేని కారణంగా ఈ దేశంలో ఏ విద్యార్థి చదువూ ఆగిపోకూడదు. అందుకే నాణ్యమైన చదువును అందరికీ అందించే విద్యావిధానాన్ని రాజకీయానికి కేంద్రబిందువుగా చేసేందుకు లోక్‌సత్తా పోరాడుతోంది' అని ఆ సందర్భంగా జేపీ అన్నారు. మాతృస్వామి 2016లో ఐఐటీ, మద్రాస్ నుంచి ఎంటెక్ పట్టభద్రులయ్యారు. ఈ విషయాన్ని తెలియచేసినప్పుడు జేపీ అభినందిస్తూ, ఒక జీవితానికి కొంత అవకాశాన్ని అందించగలిగామని, ఇలాంటి మట్టిలో మాణిక్యాలు కోట్లమంది మనదేశంలో ఉన్నారని అన్నారు. సరైన విద్యను అందిస్తే మనం అద్భుతాలను సాధించగలమన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జులై 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 14

## లోపలి పేజీల్లో...

భారత్ ఇల్లు చక్కదిద్దుకుంటేనే బ్రెగ్జిట్........... 5
అమెరికా, ఈయూ సైరన్లు.......................... 6
దారితప్పిన ఉగ్రవాద వ్యతిరేక యుద్ధం........... 11
పోటెత్తుతున్న వలసలు బతుకు బరువై........... 14
రాజకీయ ఇస్లామిజంపై నిజమైన ఇస్లాం......... 17
సంస్కరణలతోనే సమన్యాయం.................. 18
ఇలాంటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ప్రమాదం........ 20
మోదీగారి సంజయ్ గాంధీ...................... 22
దాహార్తులు - జల విలాసాలు...................... 24
డెల్టాలో ఇంకుడు గుంతలా...................... 26
మానవ వనరుల అభివృద్ధిలో సోదిలో........... 28
సరైన విధానాలుంటేనే జయహో భారత్......... 30
లోక్‌సత్తా పార్టీలో చేరిన రైతులు................ 32
అంకెల గారడీలోనూ కనిపించని ప్రయివేటు..... 33
కాంబోడియా పోలీసు స్ఫూర్తి.................... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఆలోచనలకు సరైన గీటురాళ్లు కూడా ఉండాలి



ఇటీవల ఆకర్షణీయ నగరాల మిషన్‌ను ప్రారంభిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఒక మాట చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిధులిచ్చే దాతలా కాకుండా ఆలోచనలిచ్చే వనరుగా చూస్తున్నారని తెలిపారు. నిజమైన ప్రజాస్వామిక ప్రభుత్వం, నాయకత్వం తుపాకీ ద్వారానో, తాయిలాల ద్వారానో కాకుండా.. ఆలోచనలతో ప్రజలను ప్రభావితం చేయాలని మోదీ సర్కారు గుర్తించటం సంతోషించదగ్గ విషయం. అయితే ఆ ఆలోచనలకు గీటురాళ్లు ఏవన్నది కూడా గుర్తెరగటం ముఖ్యం. హేతుబద్ధత, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించటం, ఆధునిక ప్రభుత్వం చేయాల్సిన పనులు వంటి సరైన గీటురాళ్లు లేకుండా ఆలోచనలు చేసి అమలుచేస్తే అది జాతి నిర్మాణ క్రమాన్ని దెబ్బతీస్తుంది. అణుసరఫరాదారుల బృందం (ఎన్ఎస్‌జీ)లో చేరటం, స్వచ్ఛభారత్, మానవ వనరుల అభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం.. ఇలా అనేక ప్రతిష్ఠాత్మకమైన అంశాలలో మోదీ ప్రభుత్వం ఇతరుల ఆలోచనల్ని గౌరవించకపోవటం వల్ల ఎంతో నష్టం జరుగుతోంది, దేశానికి విలువైన సమయం వృథా అవుతోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకంగా రూ. 1 లక్ష కోట్ల పైచిలుకు మేర జీతాల్ని పెంచటం తాజా ఉదాహరణ. దేశంలో మెజారిటీ ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగంలో ఉన్న సాధారణ పౌరునికి (రైతుకి) వచ్చే ఆదాయం కంటే కేంద్రప్రభుత్వంలో అట్టడుగుస్థాయి ఉద్యోగికి వచ్చే నెల జీతం ఇప్పటికే అనేకరెట్లు ఎక్కువగా ఉన్నప్పుడు, అసంఘటిత రంగంలో ఉన్న కారణంగా దేశంలోని 90శాతం మంది ప్రజలకన్నా ప్రభుత్వోద్యోగులకుండే భద్రత లేనప్పుడు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకందించే సేవలు అధ్వాన్నంగా ఉన్నప్పుడు.. ఆ పరిస్థితిని సంస్కరించటానికనుగుణంగానే ప్రభుత్వోద్యోగుల జీతాల పెంపు సహా ఏ నిర్ణయమైనా ఉండాలి. నేను ఐఏఎస్‌గా కరీంనగర్‌లో శిక్షణ పొందినప్పుడు, విశాఖ జిల్లా నర్సీపట్నంలో తొలి పోస్టింగ్ తీసుకున్నప్పుడు నా నెల జీతం సుమారు రూ.1200 మాత్రమే. బాధ్యతలతో పోల్చుకుంటే అప్పట్లో కూడా ఆ ఉద్యోగానికి అది తక్కువ జీతమే. ప్రభుత్వ డబ్బుతో ఏసీ, అధునాతన ఫర్నిచర్ సదుపాయాలకు అవకాశమున్నా కూడా నేను వినియోగించుకోలేదు. అన్ని పరిమిత వనరుల మధ్య కూడా స్వతంత్రం భారత్‌లో ఏ కలెక్టర్ సాధించని విజయాల్ని సాధించి చూపేలా నా ప్రభుత్వోద్యోగాన్ని మలచుకోలిగాను. ఒక ఉద్యోగిగా ఎంత గొప్పగా పనిచేసినా అనుకున్న మార్పుల్లో 20-30శాతమే తేగలం కాబట్టి ఇంటిస్థలం, పెన్షన్ వంటివి సౌకర్యాలు లేకుండానే రాజీనామా చేసి రాజకీయ సంస్కరణల కోసం లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించాను. మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థను, దేశ భవిష్యత్తుకు కావలసిన సంస్కరణలను క్షుణ్ణంగా పరిశీలించాకే.. మన ఉద్యోగ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ప్రతిభను బట్టి సర్వీసులో ప్రయోజనాలు, సమాజంలోని ఇతర నిష్ణాతుల సేవల్ని కూడా కొంతకాలంపాటు వినియోగించుకుంటుండటం, ప్రజలకు లంచాలు, వేధింపులు లేకుండా సర్వీస్ గ్యారంటీ చట్టం తదితర సంస్కరణల కోసం పోరాడుతున్నాం. ఈ నేపథ్యంలో.. జీతాలు, అవినీతి ఎక్కువ, సేవలు మాత్రం తక్కువ అనే రీతిలో ఉద్యోగులకు మోదీ ప్రభుత్వం జీతాల్ని పెంచటం ఏ రకమైన గొప్ప ఆలోచన? మెజారిటీ ప్రజలు పోటీ ప్రపంచంలో కనీస ఉపాధి పొందటానికి కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటానికి కాసిని నిధులివ్వటానికి ఆపసోపాలు పడిపోతారుగానీ, జనాభాలో ఒకట్రెండు శాతం ఉన్నవారి జీతాలపెంపునకు లక్షకోట్లు ఇచ్చేస్తారా? ప్రభుత్వం తన కోసం ఖర్చు చేసుకోవటానికా ప్రజల పన్నులు, వనరులు ఉన్నది?.. ఆలోచనలకు సరైన ప్రమాణాలు లేకపోతే మోదీ పార్టీకి కూడా అది దీర్ఘకాలంలో తీవ్ర నష్టం చేస్తుంది. మరోవైపు, రాష్ట్రాల నుంచి, పౌర సమాజం నుంచి వచ్చే లోతైన, సరైన ఆలోచనలను కూడా మోదీ ప్రభుత్వం గౌరవించాలి. అందరి ఆలోచనలనూ పరిగణలోకి తీసుకుని రూపొందించిన గొప్ప ఆలోచన కూడా ఆచరణలో దిగువ స్థాయిలో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం లేకపోతే విఫలమవుతుంది. అందుకే రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలను, నిధులను ఇచ్చేలా పాలన, అభివృద్ధి ఆలోచనలకు వికేంద్రీకరణను మోదీ ప్రభుత్వం జోడించాలి. దీనివల్ల విద్య, ఆరోగ్యం, రోజువారీ సేవలు వంటి అత్యంత ప్రాధాన్య రంగాలలో నిర్మాణాత్మక సృజనాత్మకత పెరిగి ప్రజాస్వామ్యంలో, జన జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయి. కాబట్టి.. ఆలోచనల ప్రాధాన్యతను గుర్తించిన మోదీ నాణ్యమైన ఆలోచనల మీద కూడా దృష్టి సారించాల్సిన సమయమిది.



# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*


చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# భారత్ ఇల్లు చక్కదిద్దుకుంటేనే
# బ్రెగ్జిట్ వంటి పరిణామాలు అవకాశాలవుతాయి: జేపీ




**యూ**రోపియన్ యూనియన్ నుంచి వైదొలగటానికి అనుకూలంగా బ్రిటన్ ఓటు వేయటం (బ్రెగ్జిట్), వలు ఇతర ఐరోపాదేశాలతోపాటు అమెరికాలో తీవ్ర జాతీయవాదులు ఆదరణ పొందటం వంటి పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొంటున్న అస్థిర పరిస్థితులు భారత్‌లో అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు మరో అవకాశమని, అయితే వీటిని సద్వినియోగం చేసుకోవాలంటే మనదేశం ముందు ఇల్లు చక్కదిద్దుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

“అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రైతులకు ఆదాయాన్నిచ్చే ఏర్పాట్లతోపాటే వ్యవసాయేతర రంగాలలో పెద్దఎత్తున ఉద్యోగాల సృష్టి, రాష్ట్రాలకు జాతీయ సమగ్రత పరిధిలో స్వయంప్రతిపత్తి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు వికేంద్రీకరణ వంటి విస్తృత ప్రభావం చూపగల నిజమైన సంస్కరణల్ని దేశంలో చేపట్టటంతోపాటు దేశమంతటినీ సామరస్యతతో ఒక తాటిపై నిలపటానికి మనం సిద్ధమైతే.. బ్రెగ్జిట్ సహా ప్రపంచ పరిణామాలు మనకు అనుకూలం” అని జేపీ అన్నారు.

భిన్నత్వంలో, సంక్లిష్టతలో భారత్ ఐరోపాకంటే పెద్దదని, మన పాలకులు కేంద్రీకృత పాలనను వదిలి వికేంద్రీకరణను చేపట్టకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతూ తీవ్రపరిణామాలకు దారితీసే అవకాశముందని జేపీ అన్నారు. విడిపోయిన బ్రిటన్‌తోపాటు ఐరోపా అంతటికీ నైపుణ్యమున్న కార్మికులు కావాలని, ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలంటే నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించటమే మార్గమని అన్నారు.

ఆడమ్ స్మిత్, రికార్డో లాంటి వారిని ప్రపంచానికి అందించిన బ్రిటన్లు ఇప్పుడు ఒంటరి ద్వీపంలా ఉండాలనుకుంటోందని, జాతీయస్థాయిలో రిఫరెండం వల్ల ఓటుకు- ఓటరు నిజమైన ప్రయోజనానికి సంబంధం మరుగునపడి తెలియనితనం, భావోద్రేకాలు, విద్వేషాలు ప్రభావం చూపే అవకాశముందని జేపీ అన్నారు. వలసలు, వాణిజ్యానికి అడ్డుకట్ట వేయటం వల్ల అందరూ నష్టపోతారని, ముఖ్యంగా భారత్ వంటి పేద దేశాలకు నష్టం ఎక్కువగా ఉంటుందని, బ్రిటన్‌తో ఉన్న చారిత్రక సంబంధాలను ఉపయోగించుకుని నేరుగా మెరుగైన సంబంధాలను నెలకొల్పుకోవాలని అన్నారు.

చైనా పట్ల అమెరికాకున్న భయాలు కూడా మనకు కొంతకాలంపాటు మాత్రమే ఉపయోగపడతాయని, మనం అల్పమైన విభేదాలను అధిగమించి.. మనకున్న యువశక్తి, ఇతర అంతర్గతబలాలతో ప్రపంచ స్థాయి గల పెద్ద ఆర్థికవ్యవస్థగా రూపుదిద్దుకోగలిగే సంస్కరణలను వేగంగా చేపట్టాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

www.twitter.com/jp_loksatta,
www.facebook.com/jploksatta ◻

# అమెరికా, ఈయూ సైరన్లు -
# నిద్రమత్తు భారత్‌కు సంస్కరణల శంఖారావాలు




ప్రపంచీకరణ పదానికి దశాబ్దాల ముందు నుంచే అమెరికా, ఐరోపాలలో ఏ పెద్ద పరిణామం జరిగినా మన మీద ప్రభావం ఉంటూ వస్తోంది. మనకు ఐదువేల ఏళ్లకు పైగా ఘనమైన వారసత్వం ఉండొచ్చు, మనం ఒకప్పుడు ప్రపంచానికే మార్గం చూపినవాళ్లం అయివుండవచ్చు, కానీ స్వయంకృతాపరాధాల వల్ల సంపదసృష్టిలో, ప్రజాస్వామిక విలువల్లో ఆధునిక అమెరికా, ఐరోపాల కంటే చాలా వెనకబడివున్నాం, వాళ్ల నుంచి ఎంతో నేర్చుకోవాల్సిన, సాయం పొందాల్సిన స్థితిలో ఉన్నాం అనేదే స్వతంత్ర భారతంలో వాస్తవం. మన రాజ్యాంగానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఎక్కువశాతం ప్రేరణ బ్రిటన్, అమెరికాలే. క్రమంగా మన ప్రమేయం లేకుండానే ప్రపంచీకరణ వంటి అంశాలలో కూడా భాగస్వాములం కావాల్సి వస్తోంది. కానీ అమెరికా, ఐరోపా దేశాల పరిణామాల వల్ల ఇప్పటివరకూ మనం ఎదుర్కొన్న ప్రభావం వేరు ఇక నుంచి ఎదుర్కోబోతున్న ప్రభావం వేరు. 2016లో అలాంటి కీలక పరిణామాలు అక్కడ చోటుచేసుకుంటున్నాయి.

సంపదలో, ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో, పాలనలో మనకంటే మెరుగ్గా ఉన్న దేశాల్లోనే అలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటే.. ఆ దేశాల బాటలోనే ప్రయాణిస్తూ ఇతర దేశాల నుంచి చెడు సంప్రదాయాలను నేర్చుకున్నంతగా మంచి సంస్కరణలను నేర్చుకోని మనదేశం మాటేమిటి? అన్న ప్రశ్న కలవరం కలిగిస్తోంది. ప్రపంచంలో ఆర్థికసంస్కరణలు మొదలైన 1970 నుంచి అమెరికాలో ఏమైనా జరిగితే మనం ప్రధానంగా ఆర్థిక, సైనిక కోణంలోనే లెక్కలేసుకుంటుండేవాళ్లం. రాజకీయ, పాలనాపరంగా మాత్రం ఆ దేశాల ప్రజాస్వామ్య సూత్రాల్ని ఎక్కువశాతం రాజ్యాంగం కాగితాలకే పరిమితం చేసి ఆర్థిక సంస్కరణలు+భూస్వామ్య అవినీతి రాజకీయాల కాంబినేషన్‌ను అమలుచేస్తూ బండి నడిపిస్తున్నాం. విధి లేని పరిస్థితుల్లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల పెరిగిన సంపదను ప్రజలను మత్తులో ముంచే తాయిలాలివ్వటానికి, మనం అగ్రరాజ్య హోదాకు అరచేయి దూరంలో ఉన్నామని నమ్మించటానికి వినియోగిస్తూ దేశాన్ని మన పాలకులు వెనక్కి గుంజుతున్నారు. ఆచరణాత్మకమైన రాజకీయ, పాలనా సంస్కరణల్ని తొక్కిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు, యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని బ్రిటన్‌లో అత్యధికులు ఓటు వేయటం (బ్రెగ్జిట్), ఫ్రాన్స్, గ్రీస్, ఆస్ట్రియా తదితర దేశాల్లో పెరుగుతున్న అతి జాతీయవాద ధోరణులు భారత్‌ను కూడా కుదిపేసేవే.

అమెరికా అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికైనా, బ్రెగ్జిట్ జరిగినా భారత్ ఆర్థికవ్యవహారాల్లో పెద్ద మార్పేమీ రాదుకానీ, స్వదేశంలో మాత్రం ఆర్థిక, రాజకీయ, పాలనాపరంగా తీవ్ర అంతర్గత ప్రభావాలు మొదలవుతాయనటంలో సందేహం లేదు. ఎందుకంటే అమెరికా, ఈయూ దేశాల్లాగే మనదేశం ఆధునిక ప్రజాస్వామ్యాన్ని స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుసరిస్తోంది. అయితే ఈ క్రమంలో ఆ దేశాల నుంచి చెడును నేర్చుకున్నంతగా వ్యవస్థీకృత మంచిని నేర్చుకోలేదు. వ్యవస్థల నిర్మాణంలో, ప్రభుత్వ నిర్వహణలో ఇంకా అధ్వాన్న స్థితిలో ఉన్నాం. దానికితోడు ఐరోపా కంటే సువిశాలమైన, భిన్నతం సంక్లిష్టతలున్న దేశం మనది. ఈ నేపథ్యంలో.. స్వేచ్ఛా వాణిజ్యం పట్ల పెద్ద వ్యతిరేకత లేకుండా అంతర్గత ఆర్థికశక్తితో బలంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాల బూచీ అక్కర్లేకుండానే అమెరికా, ఐరోపాల్లో తాజా సమస్యలకు

కారణమైన పరిస్థితులు మన వద్ద ఇప్పటికే ప్రకోపిస్తున్నాయి. కాబట్టి వెస్ట్‌లోని పరిణామాల్ని మనకు దేశీయంగా పెచ్చరిల్లే ప్రమాదాలపై మేలుకొలుపుగానే భావించాలి. మౌనం వహించినా, తాత్కాలిక ధోరణులతో వక్రమార్గం పట్టినా మున్ముందు భారత్‌కూ తీవ్ర సంక్షోభం ఉంటుంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న బహుముఖ సంక్లిష్ట పేదదేశంగా భారత్ ఇప్పుడు అమెరికా, ఐరోపాల్లోని పరిణామాలను నిశితంగా, హేతుబద్ధంగా విశ్లేషించి తగిన దిద్దుబాట్లు చేసుకోవాలి.

అమెరికా, ఐరోపా ఒడిదుడుకుల్లో ప్రధానంగా మూడు కోణాల్ని గుర్తించవచ్చు. ఒకటి) ఆర్థికవ్యవస్థ మందగమనం, రెండు) అందరికీ ఆదాయాన్ని అందించే, పెంచే పాలనా సంస్కరణల్లో లోటు, మూడు) ఈ రెంటి దిశగా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలనూ సమన్వయం చేసే ప్రజాస్వామిక ప్రక్రియను అందించటంలో రాజకీయం వైఫల్యం.

## అమెరికా సంక్షోభాన్ని బైటపెట్టిన అధ్యక్ష ఎన్నికలు

ముందు అమెరికాకి వెళ్తే, అధ్యక్ష ఎన్నికలు ఆ దేశంలోని సంక్షోభాన్ని బట్టబయలు చేశాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పెట్టే ఖర్చు కన్నా మనదేశంలో ఒక రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ఎక్కువ ఖర్చు పెడుతున్నందున ఆ దేశస్తులను వేలెత్తిచూపే నైతిక అర్హత మనకు లేదుగానీ, అమెరికన్ ఎన్నికల్లో చట్టబద్ధంగానే పెరుగుతున్న డబ్బు ప్రవాహం ధనరాజకీయాలను పెంచి పోషిస్తూ వస్తోంది. కార్పొరేట్ కంపెనీల, కొందరు వ్యక్తుల ప్రయోజనాలకనుగుణంగా వ్యవహరించటం, అందుకోసం ఎంతటి ప్రజాప్రయోజనాన్నయినా వ్యతిరేకించటం అక్కడి ప్రతిపక్షం కొన్నేళ్లుగా మొదలుపెట్టింది. అలాంటి గుడ్డి వ్యతిరేకతను ప్రోత్సహించిన రిపబ్లికన్ పార్టీ 2016కొచ్చేసరికి డొనాల్డ్ ట్రంప్ అనే అభ్యర్థి ఆవిర్భావానికి కారణమైంది. అధికారంలో ఉన్నప్పుడు యుద్ధాలు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుడ్డివ్యతిరేకత పరంపర నుంచి వచ్చిన ట్రంప్‌ని నిలువరించటం ఇప్పుడు ఆ పార్టీ వల్ల కూడా కావటం లేదు.

కానీ, ఇంతకంటే పెద్ద ప్రశ్న– ట్రంప్‌కి అమెరికా ఎందుకు అంతలా స్పందిస్తోంది?

సానుకూల దృక్పథం, ఉదారవిలువలు స్థానంలో ఇప్పుడు అమెరికాలో ఆగ్రహం కనిపిస్తోంది. 2015 డిసెంబర్‌లో సీఎన్ఎన్–ఓఆర్‌సీ జరిపిన అభిప్రాయ సేకరణలో దేశంలోని పరిణామాల పట్ల 69శాతం మంది అమెరికన్లు చాలా ఆగ్రహంగా లేదా కోపంగా ఉన్నారు. వాల్‌స్ట్రీట్, వాషింగ్టన్‌లాంటి చోట్ల మోహరించిన డబ్బు, అధికారం గలవారి కోసమే రాజకీయం పనిచేస్తోందని పలువురు ప్రజలు భావిస్తున్నట్టు ఎన్‌బీసీ/వాల్‌స్ట్రీట్ జర్నల్ పోల్‌లో వెల్లడైంది. రిపబ్లికన్లు (61శాతం), శ్వేతజాతీయులు (54శాతం) మాత్రమే కాకుండా డెమోక్రాట్లు (42శాతం), లాటినోలు (43శాతం), ఆఫ్రికన్ అమెరికన్లు (33శాతం) ఆగ్రహంతో ఉన్నారు. గత ఏడాది కంటే 2016లో అమెరికా ప్రజల ఆగ్రహం పెరిగిందని కూడా సర్వేలు తేల్చాయి. ఈ పరిస్థితుల్ని గుర్తించిన డొనాల్డ్ ట్రంప్.. రిపబ్లికన్ పార్టీ తెలియకుండానే అందించిన అవకాశంతో ఆగ్రహమూర్తి అవతారాన్ని ధరించారు. యాంగ్రీ అమెరికాకు యాంగ్రీ అధ్యక్షుడినవుతానంటూ వచ్చిన ట్రంప్ అనేకమంది సగటు అమెరికన్ల భావవ్యక్తీకరణకు సంకేతంగా మారారు. డెమోక్రాటిక్ పార్టీ తరపున హిల్లరీ క్లింటన్‌తో ప్రైమరీలలో పోటీపడిన బెర్నీ శాండర్స్ కూడా ప్రజల ఆగ్రహాన్ని గుర్తించినా ఆయన ట్రంప్‌లా మారకుండా, ప్రజాస్వామ్యయుతంగా పరిష్కారాలను ప్రతిపాదించే ప్రయత్నం చేశారు. సమస్య మూలాల్లోకి వెళ్లి విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు తదితర పరిష్కారాలను అందించారాయన. ప్రపంచాన్ని ట్రంప్ ఎక్కువ ఆకర్షిస్తున్నా, ట్రంప్, శాండర్స్ ఇద్దరూ యాంగ్రీ అమెరికాకే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ గనక పార్లమెంటరీ తరహా ఎన్నికలు జరిగితే హిల్లరీ క్లింటన్ సహా ఎవరికీ గెలుపు మెజారిటీ వచ్చే అవకాశం ఉండదు. అంతలా ఉంది ట్రంప్, శాండర్స్‌ల ప్రభావం.

అమెరికన్లకు ఎందుకీ ఆగ్రహం అని కొంచెం లోతుగా వెళ్తే, మధ్యతరగతికి, కార్మికులకు సరైన ఆదాయాలనందించటంలో, ఆర్థిక అసమానతల్ని నియంత్రించటంలో గత 15ఏళ్లుగా రాజకీయ వ్యవస్థ విఫలమవటమే ఇందుకు కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్‌లో పాలనా వ్యవహారాలను అధ్యయనం చేసే విలియం గాల్‌స్టన్ ఇదే మాటను స్పష్టంచేస్తున్నారు.

ఆర్థికమాంద్యం నుంచి బైటపడి నిరుద్యోగం 2010లో ఉన్న 10శాతం నుంచి 2015లో 5శాతానికి తగ్గినా, చాలామంది అమెరికన్లకు ఆదాయం సరిపడా కనిపించటం లేదు. ఆదాయాల్లో గత 15ఏళ్లుగా దాదాపు పెరుగుదల లేదు. అమెరికా గణాంకశాఖ వివరాల ప్రకారం, సగటు అమెరికన్ గృహాదాయం ఇప్పుడు 53,567 డాలర్లుంది. సరిచేసిన ద్రవ్యోల్బణ అంచనాల ప్రకారం, 2007లో ఈ ఆదాయం 57,357 డాలర్లుంది. 1999లో 57,843 డాలర్లుంది. ''ఉద్యోగాల్లో కూడా నాణ్యత తగ్గిపోతోంది. అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీనిపై చర్చ మొదలుపెట్టగానే, అమెరికా రాజకీయాల్లో వాళ్లు విలన్లు, వీళ్లు విలన్లు అంటూ ప్రజాగ్రహం ప్రజ్వరిల్లుతోంది. బిలియనీర్లు, బ్యాంకులు, వాల్‌స్ట్రీట్ ఒక పక్కనుండగా.. వలసదారులు, అమెరికా నుంచి ఆర్థికప్రయోజనాలు పొందుతున్న ఇతర దేశాలు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇంకో పక్కన వీరికి కనిపిస్తున్నారు. ఈ రెండూ ఒకే రాజకీయ నాణానికి పార్శ్వాలుగా ప్రజలు భావిస్తున్నారు" అని గాల్‌స్టన్ వివరిస్తున్నారు. జాతీయరహదారుల విస్తరణ వల్ల ట్రక్ డ్రైవింగ్ అమెరికాలో ఆర్థిక విస్తరణకు, ఉపాధికి ఎంతో దోహదపడింది. డ్రైవర్లు లేని వాహనాలు, రోబోల ప్రవేశం పెరుగుతుండటంతో అమెరికాలో పెద్దసంఖ్యలో ఉన్న వాహనచోదక వృత్తిదారులు తీవ్ర ఆదాయ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారమే, దాదాపు 5కోట్లమంది అమెరికన్లు పేదరిక రేఖకు దిగువన ఉన్నారు. ఈ నేపథ్యంలో విదేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలను దేశీయ అవరోధాలుగా భావిస్తూ సగటు అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో ఉన్న వివిధ జాతుల జనాభా నిష్పత్తిలో కూడా పెద్దఎత్తున మార్పులు వస్తున్నాయి. 1965 నుంచి దాదాపు 5.9 కోట్ల మంది అమెరికాకు వలసవచ్చారు. అప్పట్లో 84శాతంగా ఉన్న శ్వేతజాతీయుల (నాన్‌హిస్పానిక్) సంఖ్య ఇప్పుడు 62శాతానికి తగ్గిపోయింది. దేశంలో 1కోటీ 13లక్షలమంది చట్టవిరుద్ధమైన వలసదారులున్నారని ప్యూ సర్వే వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో.. జనాభా నిష్పత్తి, వర్ణం, సంస్కృతి, మతం, తరం ఇలా అనేక కోణాల్లో ఇప్పుడు అమెరికా పెను మార్పును చవిచూస్తోందని 'ది నెక్స్ట్ అమెరికా' రచయిత పాల్ టేలర్ అంటున్నారు. దీంతో ఏ చిన్న అవాంఛనీయ

సంఘటన జరిగినా, వలసదారులు దాడులకు లక్ష్యంగా మారుతున్నారు. తీవ్రవాదం, ఉద్యోగాలు, అసంతృప్తి వంటి సమస్యలన్నిటికీ వీరే మూలమన్నట్టు చిత్రీకరణ జరుగుతోంది. యాంగ్రీ అమెరికాకు అధికారిక గన్ కల్చర్ తోడవటం ఆందోళనకర పరిణామాలకు దారితీస్తోంది.

ప్యూ సర్వేలో ఇంకో కీలకమైన అంశం కూడా బైటపడింది. ప్రభుత్వాన్ని మీరు నమ్ముతారా? అంటే– కొన్నిసార్లు మాత్రమే అని, లేదా ఎప్పుడూ నమ్మం అని ఎక్కువమంది చెప్పారు. ఆర్థిక వ్యవస్థకి, ఉద్యోగాలకు, వలసలకు ప్రభుత్వమే కారణమని పలువురు భావిస్తున్నారు. రాజకీయ నాయకులు కొట్టుకోవటం తప్ప ప్రజలకు జరుగుతున్నదేమీ లేదని అనుకుంటున్నారు. ప్రపంచ రాజకీయాలలో అమెరికా సూపర్ పవర్‌గా ఉండనక్కర్లేదని, ముందు దేశంలోని సమస్యల్ని పరిష్కరించాలని 60శాతం మంది కోరుకుంటున్నారు. చైనా నియంతృత్వ దూకుడు పెరుగుతున్నా, ఉక్రెయిన్‌లో రష్యా ఆధిపత్య ధోరణుల్ని బాహాటంగా ప్రదర్శిస్తున్నా.. వాటి గురించి పట్టించుకోకూడదని, అమెరికా అమెరికన్ల కోసం మాత్రమే కాదు, భౌగోళికంగా కూడా అమెరికాకే పరిమితం కావాలని ఎక్కువమంది ఆశిస్తున్నారు. అందుకే ట్రంప్ కూడా దక్షిణ చైనా సముద్రంలో చైనా దురాక్రమణలను కాకుండా, చైనా ఉత్పత్తుల మీదే తన విమర్శలను ఎక్కుపెట్టారు. 'అమెరికాను చైనా రేప్ చేయటాన్ని ఇక ఎంతమాత్రం సహించకూడదు' అని అనాగరిక ముతకభాషలో భావోద్రేకాలను రెచ్చగొట్టగలిగారు. మెక్సికోలో ఫోర్డు కంపెనీ నిర్మించతలపెట్టిన పరిశ్రమను కూడా ట్రంప్ వద్దల్లేదు. అక్కడ్నుంచి అమెరికా సరిహద్దులు దాటాలంటే ఒక్కో కారు మీద 35శాతం పన్ను కట్టాలని ట్రంప్ చేసిన హెచ్చరిక అమెరికన్లను ఉత్సాహపరుస్తోంది. ఉగ్రవాద ఘటనలపై కూడా ప్రభుత్వానికి మద్దతిచ్చే ధోరణి తగ్గుతూ ప్రభుత్వాన్ని నిందించే వైఖరులు అమెరికాలో పెరుగుతున్నాయి. నిజమైన ఇస్లాంకు, రాజకీయ–ఉగ్రవాద ఇస్లాంకు తేడా తెలియకుండా ట్రంప్ ముస్లింలందరిపై వివక్షాపూరిత వ్యాఖ్యలు చేస్తున్నా గణనీయ సంఖ్యలో మద్దతు లభిస్తూనే ఉంది.

మరోవైపు, రిపబ్లికన్, డెమోక్రాటిక్ పార్టీల మధ్య సంప్రదాయంగా ప్రజలు చీలిపోయి వున్నా కూడా.. 20–30శాతం మంది రాజకీయాల పట్ల ఏహ్యభావాన్ని పెంచుకున్నారని, పలువురు మధ్యతరగతివారు, యువత పార్టీతో సంబంధం లేకుండా తమకు మేలుచేయగల ఆలోచనలున్న రాజకీయ నేతల కోసం అన్వేషిస్తున్నారని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

దేశానికి స్వతంత్రం వచ్చిన దాదాపు 140 ఏళ్ల తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన పార్టీ తరపున పోటీకి ముందుకొచ్చిన తొలి మహిళ హిల్లరీ క్లింటన్‌ను ఎదుర్కోగలిగేవారు సొంత డెమోక్రాటిక్ పార్టీలోను, ప్రత్యర్థి రిపబ్లికన్ పార్టీలోనూ లేరని అనుకుంటున్న తరుణంలో శాండర్స్, ట్రంప్ వచ్చి అంచనాలను తల్లకిందులు చేశారు. హిల్లరీ భర్త బిల్ క్లింటన్ కూడా ఆర్థికాంశం ఎజెండాగానే 1990లలో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కానీ ఈవేళ్టి ఆర్థిక ఎజెండా ఆనాటికి ఎంతో భిన్నంగా, సంక్లిష్టంగా ఉంది. మరోవైపు, అందరినీ సమన్వయం చేసే శక్తి, విధానాలు హిల్లరీ వద్ద కన్పించటం లేదు. ఆమె తక్కువ ఆదాయమున్న ఓటర్లను పూర్తిగా వదిలేశారు. శాండర్స్ మద్దతు ఆమెకు ఇక్కడ ఉపయోగపడవచ్చు. ఎక్కువ చదువుకున్న, పట్టణప్రాంత శ్వేతజాతీయులు, యువత, పెళ్లికాని మహిళలు, మైనారిటీల ఓట్ల మీదే ఆమె ఎక్కువగా ఆధారపడుతున్నారు. చివరికి, ఆర్థిక విధానాలు, వ్యక్తిగత ప్రతిభ కన్నా.. అమెరికా ఎన్నికల వ్యవస్థ, డెమోక్రాటిక్ పార్టీ నిర్మాణం మాత్రమే ఆమెను అధ్యక్షురాలిగా చేసే అవకాశముంది. తొలి మహిళా అధ్యక్షురాలిని ఎన్నుకున్న చరిత్రాత్మక సన్నివేశం కంటే కూడా అమెరికా ఈ ఎన్నికల్లో ప్రదర్శించిన భావోద్రేకాలు, ఆక్రోశాలు, లేవనెత్తిన డిమాండ్లే ఎక్కువ ప్రభావం చూపనున్నాయి. ప్రజల సంక్షోభంతో ట్రంప్ వ్యాపారం చేసి ఉండవచ్చు, అనాగరికంగా మాట్లాడివుండవచ్చుగానీ ఆయన ప్రస్తావించిన అంశాలు విస్మరించలేనివి.

ప్రధానపార్టీల తరపున హిల్లరీ, ట్రంప్ అభ్యర్థిత్వాలు దాదాపు ఖరారైనా ఇంకా అధికారికంగా ప్రకటించాల్సుంది. అయితే నవంబర్ 8న జరిగే ఎన్నికల్లో వీరిద్దరిలో ఎవరో ఒకరు లేదా అనూహ్యమైనరీతిలో వేరొకరు.. ఎవరు 58వ అధ్యక్షులైనా భవిష్యత్తులో అంతర్జాతీయ పరిణామాలపై పెను ప్రభావం చూపించేవిగా ప్రస్తుత అమెరికా ఎన్నికలను భావిస్తున్నారు.

## బ్రెగ్జిట్ బాంబు

ఇక బ్రిటన్‌కి వస్తే, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా లానే కేవలం తన వ్యక్తిగత ప్రతిభతో, అలాంటివారిని ప్రోత్సహించే పార్టీ సంస్కృతితో స్వల్పవ్యవధిలో 43 ఏళ్ల వయసులో బ్రిటన్ ప్రధాని కాగలిగారు డేవిడ్ కామెరాన్. రెండోసారి కూడా చక్కటి మెజారిటీతో ఎన్నికయ్యారు. కానీ ఆ ఎన్నికల్లో దూరదృష్టి లేకుండా ఇచ్చిన ఒక హామీ ఆయన భవిష్యత్తును, బ్రిటన్, ఐరోపా, ప్రపంచ భవిష్యత్తును తీవ్ర ఒడిదుడుకులకు లోనుచేస్తోంది. అమెరికాలోలాగానే బ్రిటన్‌లో పెరుగుతున్న ఆర్థిక అసంతృప్తులకు శత్రువులను వెతికే రాజకీయం పెరగటంతో దాన్ని ఎదుర్కొనే క్రమంలో కామెరాన్ గాడితప్పారు. ప్రజల్లో అసంతృప్తులకు కారణమైన పరిస్థితులను గుర్తించటానికి బదులు, సొంత పార్టీలోనూ, ఇతర పార్టీల్లోనూ, పౌరసమాజంలోనూ ప్రత్యర్థులు చెబుతున్నట్టు స్వేచ్ఛావాణిజ్యాన్ని యుద్ధంలో ఒక శిబిరంగా మార్చారు. ఫలితం.. ఒక తీవ్ర పరిణామాలున్న క్లిష్టమైన అంశం చుట్టూ పేకాట రాజకీయం నడిచింది. తెలిసోతెలియకో ఈయూ (ఐరోపా సమాఖ్య) నుంచి బ్రిటన్ వైదొలగాలని (బ్రెగ్జిట్) ఎక్కువమంది ఓటువేశారు. అయితే అంత వైఫల్యంలోనూ కామెరాన్ హుందాగా పదవికి రాజీనామా చేయటమొక్కటే బ్రిటన్ ప్రజాస్వామిక ప్రమాణాలకు అద్దం పట్టే అంశం. దబాయించి పదవిలో కొనసాగే అవకాశమున్నా 49 ఏళ్లకు ప్రధాని హోదాను వదులుకోవటం మనదేశం సహా చాలా చోట్ల అసాధ్యమైన అద్భుతంలాగే ఉంటుంది.

బ్రిటన్ ఈయూలో భాగస్వామి కావటం వల్ల సాటి ఐరోపా దేశాల నుంచి వలసలు పెరిగిన మాట వాస్తవం. ఈయూలోకి అడుగుపెట్టే ముందున్న పరిస్థితి కంటే బ్రిటన్ ఇప్పుడు మెరుగ్గా ఉందని, వలసదారులను నిరోధించటం కంటే వారి నైపుణ్యం, చౌక శ్రమ వల్ల వస్తున్న ఆదాయంతో బ్రిటన్ మూలవాసులకు ఎక్కువ లాభం ఉంటుందని అర్థమయ్యేట్టు చేయటంలో అక్కడి అధికార

కన్జర్వేటివ్ పార్టీ, లేబర్ తదితర ప్రతిపక్షాలు విఫలమయ్యాయి. అలాగే గతంలో వలస దేశాల నుంచి ఎంతో ఆదాయాన్ని పిండుకున్న బ్రిటన్ ఇప్పుడు నాటో కూటమిలో భాగంగా అమెరికాతో కలిసి చేసిన తప్పిదాల వల్లే ఇరాక్, సిరియా, పాలస్తీనా తదితర దేశాల నుంచి శరణార్థులు రావాల్సిన పరిస్థితులను ఏర్పడ్డాయని, కాబట్టి వారికి ఆశ్రయం ఇవ్వటం బ్రిటీషర్ల నైతిక బాధ్యత అని ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నమూ చేయలేదు. ఫలితమే బ్రెగ్జిట్ నిర్ణయం. బ్రెగ్జిట్‌పై చేసిన 13 అధ్యయనాల్లో మూడు మినహా అన్నీ ఆ నిర్ణయాన్ని చారిత్రక తప్పిదంగానే తేల్చాయి. ముఖ్యంగా యువత, మేధావులు ఆశించినదానికి విరుద్ధంగా ప్రజల తీర్పురావటం దేశ భవిష్యత్తుకు మంచి పరిణామం కాదని చెప్పకతప్పదు. ఇంగ్లండ్ పెత్తనాన్ని తప్పించుకోవటానికి ఈయూకు అనుకూలంగా ఓటువేసిన స్కాట్లాండ్ కూడా ఇంగ్లండ్ నుంచి విడిపోయే అవకాశముందని, గ్రేట్ బ్రిటన్ కూడా ముక్కలు కాకతప్పదని వాదనలు ఊపందుకున్నాయి. ఇలా దేశాలు విడిపోవటం చివరికి కెనడాదాకా కూడా పాకవచ్చని, అక్కడ కేవలం భాష కారణంగానే వేరుపడాలనుకుంటున్న క్విబెక్.. బ్రెగ్జిట్ నుంచి స్ఫూర్తిని పొందవచ్చని అంటున్నారు.

బ్రెగ్జిట్ అమలుకావటానికి ఎన్నేళ్లయినా పట్టవచ్చు, లేదా మరోసారి రిఫరెండం అంటూ అడ్డుకోవచ్చు, అసలు అమలే చేయకపోవచ్చు. కానీ ప్రజలలో నెలకొన్న తీవ్ర అసంతృప్తులు, రాజకీయ వైఫల్యం ఏమాత్రం విస్మరించలేనివి.

## ఎగ్జిట్‌ల హవా

మరోపక్క ప్రపంచయుద్ధాల విషాద అనుభవాలు పునరావృతం కాకూడదనే దీర్ఘదృష్టితో పాటు ఆర్థిక అవసరాల రీత్యా 1958లో ఏర్పడిన ఈయూ (అప్పట్లో యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీ) కూడా ముక్కచెక్కలయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఎంత కట్టడి చేసినా తమ సమస్యలకు ఈయూయే కారణం అనే భావనను తయారుచేసే రాజకీయాన్ని, ప్రజల భావోద్రేకాల్ని ఎదుర్కోవటం అన్నిసార్లూ సాధ్యం కాకపోవచ్చు. ఫ్రాన్స్‌లో నేషనల్ ఫ్రంట్ నాయకురాలు లీ పెన్, నెదర్లాండ్స్‌లో పార్టీ ఫర్ ఫ్రీడం నాయకుడు గిర్ట్ వైల్డర్స్, ఇటలీలో నార్తర్న్ లీగ్ నేత మేటియో సాల్విని వంటి వారు అతి జాతీయవాద భావాల్ని ప్రజల్లో పెంచిపోషిస్తున్నారు. ఈయూ ఏర్పడ్డాక.. ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందిన అల్జీరియా, గ్రీన్‌లాండ్ తప్ప ఏ దేశమూ ఈయూ నుంచి విడిపోలేదు. కానీ ఈవేళ్టి పరిస్థితి అంత తేలిక కాదు. ఫ్రాన్స్, ఇటలీ, ఆస్ట్రియా సహా చాలా దేశాలు బ్రెగ్జిట్‌ను అవకాశంగా వినియోగించుకుని విడిపోయేందుకు ప్రయత్నించే అవకాశముంది. అమెరికాలో కూడా ఆ ధోరణులు ప్రబలటం ఈయూ దేశాల్లోని విపరీతమితవాదులకు అదనపు బలాన్నిస్తుంది. సోషలిస్టు దేశాల పతనం తర్వాత ఈయూ విస్తరణ వేగం పుంజుకుంది కాబట్టి ఈయూ ముక్కచెక్కలవటం సోషలిస్టు భావాల విజయంగా కూడా చెప్పలేం. ఎందుకంటే, కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాలుగా చెప్పుకున్న చోట ప్రభుత్వాలను ప్రజలు ఇంతకంటే పెద్దఎత్తున ఏకమై కూల్చేశారు.

## స్విట్జర్లాండ్‌లో

ఇక్కడో ప్రత్యేకమైన ఉదాహరణను ప్రస్తావించాలి. అది స్విట్జర్లాండ్‌లో ఇటీవల 'సార్వజనీన కనీస ఆదాయం' (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం-యూబీఐ)ని స్విస్ ఓటర్లు తిరస్కరించటం. స్విట్జర్లాండ్‌లో ప్రజలందరికీ జీవించడానికి సరిపడే కొంత ఆదాయాన్ని ప్రభుత్వమే సమకూర్చాలన్న ప్రతిపాదన అది. దేశ ఆర్థికపరిస్థితులు, విధానాలు, ఆదాయవ్యయాలన్నీ అంచనా వేశాక, ప్రతి పౌరుడికీ ప్రతి నెలా రెండున్నర వేల స్విస్ ఫ్రాంకులు (దాదాపు లక్షా 70వేల రూపాయలు) ఇవ్వాలని, దీనివల్ల పేదరికం, అసమానతలను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని కొంతమంది ఉద్యమకారులు ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు. దీనికి మద్దతుగా లక్షమంది సంతకాలను సేకరించి రిఫరెండం నిర్వహించాల్సిన పరిస్థితిని వారు కల్పించారు. అయితే ఈ వాదనను రిఫరెండంలో స్విస్ ఓటర్లు భారీ మెజారిటీతో తిప్పికొట్టారు. యంత్రాలు, రోబోలు, ప్రపంచీకరణ పోటీ పెరుగుతూ ఉద్యోగాలకు ఎసరు పెడుతున్నందున ఈ ఏర్పాటు అవసరమని ఉద్యమకారులు వాదించినా.. ఖజానాపై ఏటా 250కోట్ల ఫ్రాంకుల భారం, పనిచేసే సంస్కృతి, నైపుణ్యాలు క్షీణించటం వంటి సమస్యలకు తోడు ఈ స్కీమును చూసి ఇతర దేశాల నుంచి వలసదారులు వచ్చిపడతారనే భయంతోనే స్విస్ పౌరులు యూబీఐని తిరస్కరించారు. స్విట్జర్లాండ్ ఈయూలో సభ్యదేశం కాకపోయినా వాణిజ్యం, వలసలపై ఒప్పందాలలో భాగంగా ఉంది. బ్రెగ్జిట్ వంటి పరిణామాల నేపథ్యంలో స్విట్జర్లాండ్ కూడా ఈయూతో స్వేచ్ఛా ఒప్పందాలను పునస్సమీక్షించుకునే అవకాశముందని అంటున్నారు. వలసదారులను ఇక కఠినంగా నియంత్రించవచ్చంటున్నారు. మరోవైపు, యూబీఐకి స్విట్జర్లాండ్‌లో కనీసం 25శాతం మంది ప్రజల మద్దతు ఉందని, అమెరికా వంటి దేశాలలో వై కాంబినేటర్ లాంటి సంస్థలు ఇలాంటి స్కీము కోసమే ప్రయత్నాలు ప్రారంభించాయని, మున్ముందయినా స్విస్‌లో ఇలాంటి ఆదాయ భద్రత పథకాలను తీసుకురాకతప్పదని యూబీఐ ఉద్యమకారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాలుగు వేల ఫ్రాంకులు సంపాదించే వ్యక్తిని అత్యంత నిరుపేదగా భావించే స్విట్జర్లాండ్‌లో కూడా ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం, పోటీతత్వం వంటి వాటిపై పునరాలోచన మొదలయ్యే సంకేతాలు కనిపిస్తుండటం తేలిగ్గా కొట్టిపారేయలేని అంశం.

ఉదారభావాల్ని, స్వేచ్ఛా వాణిజ్యాన్ని పరిరక్షించేందుకు దేశీయంగా, అంతర్జాతీయంగా కూడా తగిన సంస్కరణల్ని తేగల శక్తి అమెరికా, ఈయూలోని చాలా ఐరోపా దేశాలకు ఉంది. వాటి లాభాలను రుచి చూసిన ప్రజానీకం గణనీయంగా ఉన్న దేశాలవి. వలసలతో ఏర్పడి, వలస వల్ల తలెత్తుతున్న చిక్కుల్ని అధిగమించి మరీ లబ్ధి పొందాయవి. అమెరికాలో 19వ శతాబ్ది చివరిలో, 20వ శతాబ్దపు ఆరంభంలో ఆంగ్లేతర జాతీయులను తక్కువగా చూడటం మొదలైంది. అందుకే 1880లో చైనీయుల మినహాయింపు చట్టం, 1920లలో వలసల నిరోధక చట్టం వచ్చాయి. 1917లో జర్మనీపై అమెరికా యుద్ధం ప్రకటించిన సమయంలో జర్మనీ నుంచి వలసవచ్చిన వారిని (జర్మనీ ఫార్టీయైటర్స్) అమెరికన్ శ్వేతజాతీయులు కుట్రదారులుగా చూసేవారు. కానీ ప్రజల్లో సామరస్యాన్ని పెంచే విద్యావ్యవస్థ, ప్రజాస్వామిక విలువలతో అమెరికా ఆ వైఫల్యాన్ని అధిగమించింది. అప్పటికంటే ఇంకా పరిణతి పెరిగింది కాబట్టి, అమెరికా, యూరప్‌లలో ప్రపంచీకరణ సఖ్యత పట్ల ప్రస్తుత విముఖత తాత్కాలిక పరిణామమో, దీర్ఘకాలిక పరిణామమో మున్ముందు

తేలుతుంది. ఈలోగా అక్కడి పరిణామాల్ని ప్రవాసుల భద్రత దగ్గర్నుంచి అంతర్జాతీయంగా ఇతర దేశాల్లాగే భారత్ ఎదుర్కోకతప్పదు. ప్రాంతీయంగా విదేశాంగ విధానంలోనూ కొంత ప్రభావం తప్పదు. అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక ప్రయోజనాల కోసం సామంత దేశాలను ఏర్పరుచుకుని అవసరానికనుగుణంగా ఉగ్రవాదాన్ని సైతం ప్రోత్సహించటం, ఇరాక్ వంటి దేశాలపై అసమంజమైన యుద్ధాలకు దిగటమే ఇంత పెద్దఎత్తున ఉగ్రవాదం, వలసలకు కారణమనే వాస్తవాన్ని నిర్మొహమాటంగా చెబుతూ, పాశ్చాత్య దేశాల ఆధిపత్య ధోరణుల్ని అదుపు చేసే ప్రయత్నం చేయాల్సుంది (ఇరాక్‌పై సైనిక చర్య విషయంలో బ్రిటన్ తప్పటడుగు వేసిందని విచారణ సంఘం కూడా జులై 6, 2016న ప్రకటించింది. తప్పుడు నిఘాసమాచారం ఆధారంగా, శాంతియుత మార్గాలను అన్వేషించకుండానే, ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకుండానే అప్పటి బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇరాక్ మీదకు బ్రిటన్ సైన్యాన్ని పంపారని జాన్ చిల్‌కాట్ నేతృత్వంలోని కమిటీ వెల్లడించింది. ఈ నివేదిక నుంచి పాఠాలు నేర్చుకోవాలని తాజా మాజీ ప్రధాని డేవిడ్ కామరాన్ వ్యాఖ్యానించారు). కానీ ఇంతకుముందే చెప్పుకున్నట్టు, అన్నిటికంటే ముఖ్యంగా స్వదేశీ రాజకీయం, పాలన, ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌కు ఈ పరిణామాలు పెద్ద గుణపాఠాలు. కీలకమైన రాజకీయ, పాలనా సంస్కరణల్ని వాయిదా వేస్తూ వస్తుండటం వల్ల పాశ్చాత్య దేశాలతోపాటు పొరుగున ఉన్న దేశాలకంటే కూడా పలు మౌలికాంశాలలో వెనకబడిన భారత్‌కు..కస్వేచ్ఛావాణిజ్య దుష్ప్రభావాలు లేని ప్రపంచస్థాయి దేశంగా ఎదిగేందుకు ఈ గందరగోళం మరో అవకాశాన్నిచ్చిందనే చెప్పాలి.

## సంస్కరణల దిశగా భారత్ మేలుకోవాలి ప్రొటెక్షనిస్టు లిబరలిజం తోవ చూపాలి

అమెరికా, ఐరోపా దేశాల బాటలో ఆర్థిక, ప్రజాస్వామిక విధానాలను, వ్యవస్థల్ని నిర్మించుకున్న భారత్ అక్కడ ఎదురైన దుష్ప్రభావాలను నివారించుకోవటానికి ముందు దేశీయంగా అధికార, అభివృద్ధి వికేంద్రీకరణను కీలక విధానంగా చేపట్టాలి. ఎక్కడో ఢిల్లీలో కూర్చుని దేశాన్ని నియంత్రించాలనుకోవటం చాలా పెద్ద తప్పిదమవుతుంది. ప్రపంచీకరణతో ప్రజల అవసరాలు, ఆకాంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రీకృత పాలన భారత్‌లో ప్రాంతీయ అసమానతలతోపాటు కొత్త సమస్యల్ని, అలజడుల్ని పెంచుతుంది. ఇప్పటికే రాష్ట్రాల రాజకీయం చుట్టూ ఓట్లు వేస్తూ ప్రజలు వికేంద్రీకరణ దిశగా స్పష్టమైన సంకేతం ఇచ్చారు. ప్రజల భావాలను, ఇతర దేశాల అనుభవాలను గుర్తించి జాతీయ స్థాయి అంశాలకు సంబంధించినవి మినహా మిగిలిన అధికారాలను, నిధులను రాష్ట్రాలకు బదిలీ చేయాలి. సొంత పాలనాపద్ధతుల్ని ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను రాష్ట్రాలకు ఇవ్వాలి. ఇలాంటి దేశవ్యాప్త స్వయంప్రతిపత్తి విధానంతో జమ్మూకాశ్మీర్ సమస్యను కూడా సులభంగా పరిష్కరించవచ్చు. రాష్ట్రాలు విధిగా స్థానిక ప్రభుత్వాలకు కూడా మూడోవంతు నిధులు ఇచ్చేట్టు చేయటంతోపాటు ఎన్నికల నిర్వహణలో స్వతంత్రతకు అవకాశమివ్వాలి. ఇలాంటి మూడంచెల ఫెడరలిజం వల్ల ప్రజలు ఎక్కడికక్కడ పాలనలో భాగస్వాములవుతారు. పాలన వేగంగా జరుగుతుంది. స్థానికంగా అవినీతి ఉంటే ప్రజలు ప్రత్యక్షంగా పరిష్కారంలో భాగమవుతారు. వికేంద్రీకరణకు తోడు నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందరికీ అందించి, పట్టణాలను-గ్రామాలను అనుసంధానిస్తూ వ్యవసాయేతర రంగాలలో భారీఎత్తున ఉద్యోగాల సృష్టిని చేయాలి. స్వేచ్ఛావాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూనే అవసరమైన దిగుమతులపై సుంకాలను విధించి స్వదేశీ రైతులు, ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ప్రోత్సాహకాల్ని అందించాలి, దేశీయ మౌలికవసతుల్ని పెంచాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు వేధింపులు, లంచాలు లేకుండా సేవలు అందేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని తేవటంతోపాటు సర్కారీ కొలువుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలి. ప్రమాణాలకు తగ్గట్టు పనిచేయనివారిని తొలగించటంతోపాటు సమాజంలో సేవా దృక్పథమున్న నిష్ణాతుల్ని తాత్కాలికంగా వినియోగించుకునే ఏర్పాటు రావాలి. 90శాతంగా ఉన్న అసంఘటిత రంగాన్ని సంఘటిత ఉపాధి రంగంగా మార్చాలి. చట్టబద్ధ పాలనను నిర్దాక్షిణ్యంగా అమలుచేయటంతోపాటు తెలిగ్గా న్యాయం అందరికీ అందేందుకు పోలీసు, న్యాయ సంస్కరణలను తీసుకురావాలి. ధన రాజకీయాలకు, దోపిడీకి, ఫిరాయింపులకు, పేదరికానికి, విద్వేషాలకు మూలంగా తయారైన ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించి, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయాలి. దామాషా ఎన్నికల వ్యవస్థను తీసుకురావాలి. రాజ్యసభ అధికారాలను పరిమితం చేసి, ఆ ఎన్నికల్లో స్థానిక ప్రభుత్వాలకు పాత్ర కల్పించాలి.

ఈ కనీస సంస్కరణలను అమలుచేయటంతోపాటు ప్రజల మధ్య సామరస్యతను పెంపొందించటాన్ని భారత్ నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలి. నాణ్యమైన విద్య, చెడును నిరుత్సాహపరుస్తూ మంచిని ప్రోత్సహించే వ్యవస్థల నిర్మాణం, కుటుంబ విలువలు, దక్షిణాసియాను ఒక యూనిట్‌గా భావించే విశాల విదేశాంగ దృక్పథం ఇందులో కీలకాలు. విశ్వవ్యాప్తంగా అనేక విప్లవాలకు ఊపిరులూదిన రాజనీతి తత్వవేత్తలు చెప్పినట్టు, సామరస్యతను చెడగొట్టే ఏ ప్రయత్నమైనా వృథా. ప్రజల మధ్య చిచ్చుపెట్టేవాళ్లు ఎంత గొప్ప విజయాలను సాధించినా వాళ్లు చేసేది దేశద్రోహమే అవుతుంది. పంథా మార్చుకుంటేనే వాళ్లు ఏదైనా సాధించగలిగేది. పూర్తి ఆచరణ సాధ్యమైన ఈ మార్పులు చేసుకోగలిగితే బ్రెగ్జిట్ వంటి పరిణామాలు భారత్‌లో పేదరిక నిర్మూలనకు గొప్ప సదవకాశాలుగా కూడా మారతాయి.

ప్రపంచంలో ఏ సరిహద్దయినా ఉండేది మ్యాప్‌లలోనే. కానీ సరిహద్దుల్ని చెరిపేసే శక్తిని ఇంకా మానవాళి సంతరించుకోలేదన్నది సుస్పష్టం. పదివేల ఏళ్ల క్రితం వ్యవసాయంతో ప్రపంచీకరణ మొదలైనా, ఇంత శాస్త్రసాంకేతిక అభివృద్ధి జరిగినా కూడా ఇంకా ద్వీపంలా జీవించగలమనుకునే భ్రమను కొనసాగించే పరిస్థితులు పూర్తిగా తొలగిపోలేదు. అమెరికాలో, ఈయూలో పరిణామాలు, ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థల తెగబాట్లు ఇదే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే కాలం ప్రొటెక్షనిస్టు లిబరలిజం (జీవనభద్రతతో కూడిన ఉదారవాదం)దే అవుతుంది. అంటే సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం కలగలిసిన లోక్‌సత్తా భావజాల అంశాలదే భవిష్యత్తు. ప్రొటెక్షనిస్టు లిబరల్ సంస్కరణలతో, సామరస్య సుస్థిర సామాజిక విలువలతో ఇల్లు చక్కదిద్దుకుని ప్రపంచానికి తోవ చూపటమే ఇప్పుడు భారత్ చేయాల్సిన పని. □

# దారితప్పిన ఉగ్రవాద వ్యతిరేక యుద్ధం

- డా॥ జయప్రకాష్ నారాయణ్




అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ జూనియర్ అనుసరిస్తున్న కఠిన వైఖరి వల్ల ఇరాక్ మీద దాడి చేయడం అనివార్యంగా కనిపిస్తోంది. గత సంవత్సరం సెప్టెంబరు 11న జరిగిన ఉగ్రవాదుల ఘాతుక చర్యలతో అమెరికా, దాని మిత్రదేశాలు ప్రపంచమంతటా ఉగ్రవాదం మీద యుద్ధాన్ని ప్రకటించాయి. మొదట్లో సెప్టెంబరు 11 సంఘటనలకు కారణమైన ఒసామా బిన్ లాడెన్ నాయకత్వంలోని అల్‌ఖైదాపైన, ఆ తీవ్రవాద సంస్థకు ఆశ్రయమిచ్చిన కరడు కట్టిన మతవాద ఆఫ్ఘన్ ప్రభుత్వం 'తాలిబాన్'పైన ప్రపంచం దృష్టి పడింది. తాలిబాన్ల పతనంతో ఇస్లామిక్ తీవ్రవాదం పూర్తిగా అంతం కాలేదు. లాడెన్ జీవించి ఉన్నాడనే పుకార్లు వినవస్తున్నాయి. ఇటీవల ఇండొనేషియాలోని బాలి ద్వీపంలో జరిగిన బాంబు పేలుళ్ల వెనక అల్‌ఖైదా హస్తం ఉన్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఆ సంఘటన తరువాత అల్‌ఖైదా అనుచరులను అభినందిస్తూ ఒసామా పేరుతో పంపిన ఫ్యాక్స్ సందేశం పత్రికలకు అందింది. ఆ పైన లాడెన్ చేసిన ప్రకటనను అల్‌జజీరా అరబ్ టెలివిజన్ ఛానల్‌లో ప్రసారం చేసినట్టు వార్తలు వచ్చాయి. అల్‌ఖైదా బృందాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండొనేషియా, మలేషియాలలో తలదాచుకున్నట్టు సమాచారం వెలువడింది. పాకిస్తాన్‌లో పశ్చిమాన ఉన్న బెలూచిస్తాన్, వాయవ్య సరిహద్దు రాష్ట్రాలలో అల్‌ఖైదాకు చాలా మద్దతు ఉందని, ఇస్లామిక్ తీవ్రవాదులు అక్కడ స్థావరాలు ఏర్పరచుకున్నారని అందరికీ తెలుసు. ఇటీవల పాకిస్తాన్‌లో కేంద్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఆ రెండు రాష్ట్రాలలోను మతతత్వ ఇస్లామిక్ పార్టీల కూటమి ఎం.ఎ.ఎం గెలిచింది. జాతీయ అసెంబ్లీలో కూడా 49 స్థానాలను మతతత్వ కూటమి గెలుచుకుంది. బెనజీర్ భుట్టో సారథ్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ ఈ మతతత్వవాదులతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తోందని కూడా వార్తలు వెలువడ్డాయి. అరెస్టును తప్పించుకోవడానికి బెనజీర్ విదేశాలలో తలదాచుకుంటున్నా, ఆమె పార్టీ పాకిస్తాన్‌లో నియంతృత్వ ప్రభుత్వానికి ఎదురొడ్డి, ఎన్నికలలో రిగ్గింగుని తట్టుకుని 60కిపైగా స్థానాలను గెలుచుకుంది. ఈ పరిణామాలన్నీ భారత్ భద్రత మీద తీవ్ర ప్రభావాన్ని కనబరుస్తున్నాయి. అందువల్ల అమెరికా అనుసరించబోయే వ్యూహం మనదేశానికి చాలా కీలకమయినది. ఈ నేపథ్యంలో ఇరాక్‌పైన అమెరికా యుద్ధానికి దిగటం ఏ మేరకు సబబో పరిశీలించాల్సి ఉంది.

## తప్పించుకొంటున్న తీవ్రవాదులు

ఇస్లామిక్ తీవ్రవాదానికి సిసలైన కేంద్రం పశ్చిమ ఆసియా. ఈజిప్టులోను, పాకిస్తాన్‌లోను ఈ తీవ్రవాదానికి సైద్ధాంతిక ప్రాతిపదికలున్నాయి. పాకిస్తాన్‌లోని మదర్సాలలో విద్యార్థులకు బాల్యం నుంచి తీవ్రవాద భావాలను రంగరించి పోస్తున్నారు. సౌదీ అరేబియా నుంచి డబ్బు అందుతోంది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లలో తీవ్రవాదులు తలదాచుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఆగ్నేయ ఆసియాలో కూడా అల్‌ఖైదా, అనుబంధ సంస్థలు బాగా విస్తరించినట్టు స్పష్టమవుతోంది. బాలిలో జరిగిన బాంబు దాడిలో 200మందికిపైగా పర్యాటకులు మరణించటం, అందులో ఎక్కువమంది పాశ్చాత్యులే ఉండటం ఇండొనేషియాలో అల్‌ఖైదా తీవ్రవాదుల ప్రభావాన్ని రుజువు చేస్తోంది. అలాగే మలేషియాలో, ఫిలిప్పిన్స్‌లోని కొన్ని ప్రాంతాలలో తీవ్రవాదులు ఉన్నట్టు సమాచారం. ఈ పరిస్థితులలో అసలు తీవ్రవాద

సంస్థలను, వారి హింసాత్మక కార్యకలాపాలను విస్మరించి ఇరాక్‌పైన యుద్ధానికి దిగటం అసంబద్ధం. అమెరికాను, పాశ్చాత్య దేశాలను, భారత్ వంటి దేశాలను దెబ్బతీయటం లక్ష్యంగా పెట్టుకున్న మతఛాందస సంస్థలను నిర్మూలించటం నేడు నాగరిక ప్రపంచానికి తక్షణావసరం. అలాంటప్పుడు తీవ్రవాద సమస్య ఒకచోట ఉంటే, యుద్ధాన్ని మరొకచోట చేయబూనటం విచిత్రం. ముస్లిం జనాభా అధికంగా ఉన్న టర్కీ, ఇరాక్, లెబనాన్, పాలస్తీనాలు లౌకికవాదాన్ని, ఆధునిక భావాలను ప్రోత్సహించే దేశాలుగా పేరు పొందాయి. టర్కీలో దాదాపు 90 ఏళ్ల క్రితమే ఆటోమన్ సామ్రాజ్యాన్ని అంతం చేసి కమాల్ అటాటర్క్ లౌకిక రాజ్యాన్ని స్థాపించారు. ఆయన కృషి వల్ల టర్కీ ఆధునిక యుగంలోకి ప్రవేశించిన మొదటి ముస్లిం దేశమయింది. ఇప్పటి నుంచి టర్కీలో మతతత్వం అదుపులో ఉంది. ఇటీవలి కాలంలో అడపాదడపా ఇస్లామిక్ పార్టీలు పుంజుకుంటున్నా, ఆ దేశంలోని అధిక సంఖ్యాక వర్గాలు, సైనిక దళాలు, పత్రికలు ఛాందసవాదాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నాయి. టర్కీ తరువాత ఆధునికతను పుణికి పుచ్చుకున్న ఇస్లామిక్ సమాజాలు ఇరాక్, పాలస్తీనా, లెబనాన్. పాలస్తీనాకు ఇంకా స్వంత దేశం లేకపోయినా అక్కడి ప్రజలలో లౌకిక భావాలు బలంగా ఉన్నాయి. ఇప్పటికీ పాలస్తీనియన్లలో దాదాపు 20శాతం క్రైస్తవులు ఉన్నారు. అలాగే లెబనాన్‌లో 30శాతంపైగా మెరోనైట్ క్రైస్తవులున్నారు. స్వతంత్ర పాలస్తీనా కోసం కొందరు పాలస్తీనియన్లు కొంతకాలం ఉగ్రవాదానికి పాల్పడ్డారు. కానీ అందులో మతతత్వం లేదు. టెర్రరిజాన్ని అరాఫత్ బహిరంగంగా వ్యతిరేకించారు. చిత్రమేమంటే అలాంటి పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ అణచివేస్తుంటే అమెరికా దానికి నేడు వంతపాడుతోంది. ఇక ఇరాక్ విషయానికి వస్తే, కొన్ని దశాబ్దాలుగా అక్కడ బాత్ సోషలిస్టు పార్టీ అధికారంలో ఉంది. ఆ దేశంలో నిరంకుశ ప్రభుత్వం ఉంది. అక్కడ ఏకవ్యక్తి పాలన కొనసాగుతోంది. కానీ అధికార బాత్ పార్టీ మత ఛాందసానికి వ్యతిరేకం. అక్కడి మహిళలకు సమాజంలో పురుషులకు తీసిపోని స్వేచ్ఛ, అవకాశాలు ఉన్నాయి. వేష భాషలలో, సమాజ జీవనంలో వారికి ఏ ప్రతిబంధకాలు లేవు. ఆ దేశంలో అక్షరజ్ఞానం ఇతర అరబ్ దేశాలన్నింటికంటే ఎక్కువ. పాలనలో మతతత్వం మచ్చుకు కూడా కానరాదు. ఆధునికతను ఆహ్వానిస్తున్న అలాంటి దేశంతో ఉగ్రవాదంపైన పోరాటం పేరుతో కయ్యానికి దిగటం ఆశ్చర్యకరం. ఇరాక్‌లో నియంతృత్వం రాజ్యమేలుతోంది కాబట్టి అమెరికా యుద్ధానికి దిగాలనటం హాస్యాస్పదం. ప్రతి అరబ్ దేశంలోను ప్రస్తుతం నియంతృత్వమే రాజ్యమేలుతోంది. మిగిలిన దేశాలన్నింటితో అమెరికాకు సత్సంబంధాలున్నాయి. పాకిస్తాన్ నేటి వరకు నియంతృత్వంలోనే ఉంది. కానీ, ముషారఫ్ అమెరికాకు ఆప్తమిత్రుడు. నిజానికి అమెరికా వివిధ దేశాలలో నియంతలను సమర్థిస్తూ వస్తోందని అందరికీ తెలుసు. ఒకప్పుడు సద్దాం హుస్సేన్ అమెరికాకు సన్నిహిత మిత్రుడు. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చాక, ఆ దేశాన్ని నిలువరించడానికి అమెరికా ఇరాక్‌ను ప్రోత్సహించి సైనిక సాయాన్ని అందించింది. ఇరాన్-ఇరాక్ యుద్ధం ముగిసి, కువైట్‌పైన ఇరాక్ దురాక్రమణకు ఒడిగట్టినప్పుడు మాత్రమే అమెరికా ఇరాక్ మీద, సద్దాం హుస్సేన్ మీద బలప్రయోగానికి దిగింది.

**అణ్వాయుధాల బూచి**

ఇక సద్దాం హుస్సేన్ మానవాళిని మట్టుబెట్టగల జీవ రసాయన, అణు ఆయుధాలను సేకరిస్తున్నారని, వాటిని నిర్మూలించటం కోసం యుద్ధం తప్పదని, లేకపోతే అమెరికాకు, ప్రపంచానికి ముప్పు వాటిల్లుతుదని జార్జిబుష్ వాదిస్తున్నారు. అమెరికా ఆధ్వర్యంలో 1991లో ఐక్యరాజ్య సమితి దళాలు ఇరాక్‌పై యుద్ధం చేసి కువైట్ నుంచి ఆ దేశాన్ని తరిమికొట్టాయి. ఆ తరువాత ఇరాక్ మారణాయుధాలను సేకరించరాదని, తయారుచేయరాదని ఐక్యరాజ్య సమితి షరతులు పెట్టి తీవ్ర ఆంక్షలను విధించింది. ఇరాక్‌లోని ఆయుధాలను, వివిధ ప్రాంతాలను తనిఖీ చేయడానికి సమితి తరపున ఒక తనిఖీ బృందం వెళ్లింది. ఆయుధాల తనిఖీ బృందం 1998 డిసెంబరు దాకా ఇరాక్‌లో నిరాయుధ ఒప్పందం అమలును పర్యవేక్షించింది. తమ ఆంక్షలన్నింటినీ ఇరాక్ అమలుచేయడం లేదని, తమతో సహకరించడం లేదని సమితి బృందం వివిధ ఆరోపణలు చేసిన మాట వాస్తవం. ఆ కారణంగానే చివరకు ఆ బృందం నాలుగేళ్ల క్రితం తనిఖీని నిలిపివేసి తిరిగి వచ్చింది. తత్ఫలితంగానే ఇరాక్‌పైన ఆర్థిక ఆంక్షలను కొనసాగిస్తూ వచ్చారు. ప్రపంచానికి ప్రమాదంగా పరిణమించే ఆయుధాలను ఇరాక్‌లో ఉత్పత్తి చేస్తున్నట్టు సాక్ష్యాలేవీ లేవు. అదీకాక ఐక్యరాజ్య సమితి బృందాన్ని ఆయుధాగారాల తనిఖీకి నిర్నిరోధంగా ఆహ్వానిస్తామని ఇరాక్ బహిరంగంగా ప్రకటించింది. ఇరాక్‌లో రసాయన, జీవ ఆయుధాలను ఉత్పత్తి చేసే కర్మాగారాలను సమితి బృందం గతంలోనే ధ్వంసం చేసింది. ఎన్నో క్షిపణులను పనికిరాకుండా చేశారు. ఇంకా అలాంటి ఆయుధాలున్నట్టుగానీ, ఉత్పత్తి చేస్తున్నట్టుగానీ ఆధారాలు లేవు. ఒకవేళ సందేహముంటే అన్ని స్థలాలను తనిఖీ చేసుకోవచ్చని ఇరాక్ విస్పష్టంగా చెప్పింది. అలాంటప్పుడు ఏదో ఒక వంకన ఇరాక్‌పై దాడికి దిగటం బాధ్యతారాహిత్యమే అవుతుంది. ఆధారాలు చూపమంటే అణ్వాయుధాలను అమెరికా మీద ప్రయోగించటమే నమ్మదగ్గ సాక్ష్యం కావచ్చని జార్జిబుష్ వితండ వాదన చేస్తున్నారు. ఆ విధంగా అణ్వాయుధాల బూచిని అమెరికా ప్రజలకు చూపి భయపెడుతున్నారు. స్వదేశంలోని ప్రత్యర్థులు ఇరాక్‌పై

యుద్ధాన్ని వ్యతిరేకిస్తే దేశద్రోహులుగా జమకట్టాల్సి వుంటుందనే భావాన్ని బుష్ నర్మగర్భంగా ప్రకటిస్తున్నారు. బ్రిటిష్ ప్రధానమంత్రి తప్ప ప్రపంచంలో మరే నాయకుడు అమెరికా దాడిని సమర్థించటం లేదు. జర్మనీలో ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం ఇరాక్‌పై యుద్ధాన్ని వ్యతిరేకించిన కారణంగా సోషల్ డెమోక్రాట్లు ఛాన్సలర్ ష్రోడర్ నాయకత్వంలో విజయం సాధించారు. ఆ ఎన్నికలలో ఇరాక్‌పై యుద్ధమే ప్రధాన అంశంగా ప్రజల ముందుకు వచ్చింది. బ్రిటన్‌లో కూడా అధికార లేబర్ పార్టీలోనే ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌కు ఈ అంశంపైన చాలా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇరాక్ నిజంగా మారణాయుధాలు ఉత్పత్తి చేసి ప్రపంచానికి ప్రమాదంగా పరిణమిస్తే ఆ దేశంపైన దాడికి దిగటం భావ్యం. అయితే అందుకు ఎలాంటి ఆధారాలు చూపకుండా కయ్యానికి కాలుదువ్వటం మధ్యయుగాలను తలపిస్తోంది. సమితి తనిఖీ బృందాలను పంపి, వాటి బాధ్యతల నిర్వహణలో అడ్డంకులు కల్పిస్తే అప్పుడు ప్రత్యామ్నాయాలను గురించి ఆలోచించవచ్చు. అలాకాక ఏకపక్షంగా ఇరాక్‌పై దాడికి దిగితే అమెరికా ఏకాకి కావటం, ప్రపంచ దేశాల సానుభూతిని కోల్పోవటం తథ్యం. అసలు ఉగ్రవాదానికి పాల్పడుతున్న అల్‌ఖైదాను, అందుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణభూతమవుతున్న దేశాలను ఉపేక్షించి, ఇరాక్ మీద దాడికి దిగడం వల్ల ఉగ్రవాదం అంతరించకపోగా ప్రపంచం అల్లకల్లోలమయ్యే ప్రమాదముంది.

### సంయమనం అవసరం

నేటి ప్రపంచంలో అమెరికా ఏకైక సూపర్ పవర్. ఆ దేశాన్ని ఎదిరించే శక్తి ఎవరికీ లేదు. కానీ ఎంత బలం ఉంటే అంత బాధ్యతతో, సంయమనంతో వ్యవహరించటం అవసరం. ఆధునిక భావాలకు, సాంకేతిక విజ్ఞానానికి, అసాధారణ ప్రగతికి అమెరికా చిహ్నం. అలాంటి దేశం ఇప్పుడు అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఖాతరు చేయకుండా దుందుడుకుగా ఇరాక్ మీద తన ప్రతాపాన్ని చూపటం అసమంజసం. ఇరాక్ అంటే సద్దాం హుస్సేన్ కాదు, ఆ దేశంలో నివసిస్తున్న లక్షలమంది అమాయక ప్రజలు. కేవలం సద్దాంను తొలగించాలన్న పట్టుదల ఉంటే అందుకోసం ప్రయత్నాలు చేసుకోవచ్చు. కానీ ఒక నియంతను తొలగించటం కోసం ఎలాంటి ఆధారాలు చూపకుండా యుద్ధానికి దిగటం వల్ల జననష్టంతోపాటు ఇస్లామిక్ దేశాలలో మరింతగా తీవ్రవాదానికి ఆజ్యం పోసే ప్రమాదముంది. అసాధారణ బలం ఉన్నవారు అసాధారణ సంయమనాన్ని కూడా పాటించటం అవసరం.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా అక్టోబర్ 21, 2002న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ◻

# అధికార వికేంద్రీకరణే అత్యుత్తమ మార్గం




సమానత్వం ఉంటేనే ప్రపంచీకరణతో అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రపంచీకరణ జరుగుతున్న దశలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనందున ఆ ప్రయోజనాలను సంపూర్ణంగా పొందాలంటే అన్ని స్థాయిల్లోనూ అధికార వికేంద్రీకరణే అత్యుత్తమ మార్గమని కేంద్ర ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ప్రొఫెసర్ హనుమంతరావు అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ సమగ్రాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక శాఖకు చెందిన అధికారులకు 'తెలంగాణ సాధికారత'పై ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికార వికేంద్రీకరణతోపాటు నాణ్యమైన విద్య, వైద్యం అవసరమని ఈ సందర్భంగా స్పష్టంచేశారు. "అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేయాలి. నాణ్యమైన విద్యను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం ప్రకటించిన కేజీ టూ పీజీ పథకం సరైన ప్రణాళిక లేకపోవటం వల్ల అమలుకు నోచుకోలేదు. తాగు, సాగునీటికి గోదావరి జలాలను వాడుకునే అవకాశమున్నప్పటికీ తెలంగాణవ్యాప్తంగా భూగర్భ జలాలనే ప్రజలు అధికంగా ఉపయోగిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు, పర్యావరణం సంబంధిత అంశాలలో నాణ్యమైన సేవలు ప్రజలకు అందేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టాలి. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన మార్పుల ఫలితంగా సమాచార సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందింది. అయితే ఆయన ఆశించిన మేరకు పంచాయతీరాజ్ వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ మాత్రం జరగలేదు" అని హనుమంతరావు అన్నారు. ప్రజలు ఆశించిన లక్ష్యాలు నెరవేరాలంటే రాష్ట్రంలోని ప్రణాళికా మండలి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఇందుకు తగిన శిక్షణను, సాంకేతిక సహకారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ◻

# పోటెత్తుతున్న వలసలు బతుకు బరువై... భద్రత కరవై!


- కైజర్ అడపా

అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడుతున్న డొనాల్డ్ ట్రంప్, బ్రెగ్జిట్ అనుకూల బోరిస్ జాన్సన్, ఇస్లామిక్ స్టేట్ అధినేత అల్ బాగ్దాదీల మధ్య ఒక పోలిక ఉంది. అది- వీరంతా అంతర్జాతీయ వలసల నుంచి లబ్ధి పొందుతున్నవారు కావడమే. అమెరికాలోకి అక్రమ వలసల్ని ఆపేస్తామంటూ ట్రంప్ హోరెత్తిస్తుండగా, వలసలను నిరోధించాలంటే ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ బయటకు రావాలని లండన్ మాజీ మేయర్ జాన్సన్ హంగామా చేశారు. 86దేశాల నుంచి వలస వచ్చిన 30వేల మంది ఉగ్రవాదుల సైన్యం, అల్ బాగ్దాదీ నాయకత్వంలో ఖలీఫా రాజ్య స్థాపనకు పోరాడుతోంది. ఐరోపాకు శరణార్థులను అక్రమ రవాణా చేసే స్మగ్లర్లకు, వలసలను వ్యతిరేకించే నాయకులకు ఒకటే తేడా. స్మగ్లర్లు ఆర్థికంగా లాభపడుతుంటే, నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు. మనుషులను అక్రమ రవాణా చేసేవారు 2015లోనే 600 కోట్ల డాలర్లమేర ఆర్జించారు. శరణార్థి సంక్షోభానికి పరిష్కారం కనుగొనేంతవరకు మధ్యధరా, అండమాన్ సముద్రాల్లో వందలమంది మరణిస్తూనే ఉంటారు. టర్కీ, లెబనాన్, జోర్డాన్ సహాయ శిబిరాల్లో లక్షలమంది మగ్గుతూనే ఉంటారు.



**జీవన పోరాటం**

రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఎన్నడూ లేనంతగా శరణార్థుల సంఖ్య 2015లో 6.53కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితి శరణార్థి వ్యవహారాల హైకమిషనర్ ఫిలిపో గ్రాండి చెబుతున్నారు. జూన్ 20 శరణార్థి దినం నాడు విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి 24 మంది నిర్వాసితులవుతున్నారు. యుద్ధాలు, అణచివేతల వల్ల ఇళ్లూవాకిళ్లూ వదిలి పరారైనవారిలో 4.08 కోట్లమంది స్వదేశంలోనే వేరేచోట్ల తలదాచుకుంటున్నారు. ఈ నిర్వాసితుల్లో సగం మంది బాలలే. 32 లక్షలమంది శరణార్థులు సంపన్న దేశాల్లో రాజకీయ ఆశ్రయం కోసం దరఖాస్తు చేయగా, 2.13కోట్ల మంది విదేశాలకు వలస వెళ్లారు. ప్రపంచ శరణార్థుల్లో అత్యధికులు సిరియా (49లక్షలు), ఆఫ్ఘనిస్తాన్ (27లక్షలు), సోమాలియా (11లక్షలు)లకు చెందిన వారే. 'శరణార్థుల బాధలు వర్ణనాతీతం. వీరి సమస్యలు తీర్చటానికి ప్రపంచం తక్షణమే నడుం బిగించాలి' అని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఉద్ఘాటించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రపంచ నాయకులు ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో పాల్గొనబోతున్న దృష్ట్యా- శరణార్థుల సమస్యపై అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. 'సముద్రంలో వేలాది శరణార్థులు, వలసదారులు మరణిస్తుంటే, భూమార్గంలో వారి రాకను వివిధ దేశాలు అడ్డుకుంటున్నాయి. కొన్ని దేశాల్లో రాజకీయ ఆశ్రయం మంజూరుకు ప్రతిఘటన ఎదురవుతోంది. శరణార్థులతోపాటు యావత్ మానవాళి శ్రేయం కోసం ప్రపంచ దేశాలు చేతులు కలపాలి' అని ఫిలిపో గ్రాండి పిలుపిచ్చారు. కానీ, పశ్చిమాసియా నుంచి శరణార్థులు, తూర్పు ఐరోపా నుంచి ఆర్థిక వలసదారుల ప్రవాహంతో ప్రపంచీకరణ, ఐరోపా సమాఖ్యల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నాయి. దీనిపై పేద, ధనిక దేశాల మధ్యే కాకుండా సంపన్న దేశాల్లో మేధావులకు, సామాన్య ప్రజలకు మధ్య భేదాభిప్రాయాలు పెరుగుతున్నాయి. 'ధనిక దేశాల్లో 25శాతం ఓటర్లు వలసలను వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై ప్రధాన రాజకీయ పార్టీల విధానాలను ప్రతిఘటిస్తున్నారు' అని స్వీడన్ మాజీ ప్రధాని కార్ల్ బిల్ట్ చెప్పారు. బ్రెగ్జిట్ ఈ అంశాన్ని విస్పష్టంగా వెల్లడించింది. సమస్య మూలాలను కచ్చితంగా




అంచనా వేసి, పరిష్కారం కనుక్కొనేంత వరకు- వలసదారులు, శరణార్థుల ప్రవాహం తగ్గదు.

పశ్చిమాసియాలో యుద్ధాలు, ఆఫ్ఘనిస్తాన్ ఆఫ్రికాల్లో అంతర్యుద్ధాలు, తూర్పు ఐరోపాలో ఆర్థికమాంద్యం, పలు దేశాల్లో రాజకీయ వేధింపులు, పేదరికం- ఇవన్నీ శరణార్థులు, ఆర్థిక వలసదారులను సంపన్న దేశాల వైపు నెడుతున్నాయి. ఆయా దేశాల్లో నిరుపేదలు, బడుగువర్గాల స్థితిగతులు మెరుగుపడనంత వరకు వలసలు పోటెత్తుతూనే ఉంటాయని ఐరాస మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ వ్యాఖ్యానించారు. 1978 తర్వాత ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లమందిని పేదరికం నుంచి ఉద్ధరించగా, వారిలో 80 కోట్లు ఒక్క చైనాలోనే ఉన్నారు. మిగతా దేశాల్లో పేదరిక నిర్మూలన అరకొరగానే సాగింది. అంతర్జాలం, స్మార్ట్‌ఫోన్‌ల వల్ల పేద, ధనిక అంతరాల గురించి అవగాహన పెరగటంతో మంచి భవిష్యత్తు కోసం వర్ధమాన దేశాల నుంచి వలసలు అధికమవుతున్నాయి. నేడు ప్రపంచమంతటా 25 కోట్లమంది ఉపాధి కోసం ఇతర దేశాల్లో నివసిస్తున్నారు. వీరందరినీ ఒకచోటుకు చేరిస్తే అయిదో పెద్ద దేశంగా అవతరిస్తారు. ఆఫ్రికాలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను గుమ్మరిస్తున్న చైనా, అక్కడి ప్రాజెక్టుల్లో పది లక్షలమంది చైనీయులను నియోగించిందని అంచనా. విదేశాల్లో నివసిస్తున్న రెండు కోట్ల మంది భారత సంతతి ప్రజలు అనేక రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో నెలకొల్పుతున్న ప్రతి పది కంపెనీల్లో ఒకటి ప్రవాస భారతీయులు స్థాపించినదే. ఈ ఆర్థిక వలసదారులు మాతృదేశాలకు ఏటా 50వేల కోట్ల డాలర్ల విదేశ మారక ద్రవ్యాన్ని పంపుతుండగా, ఒక్క భారతీయులే 7,000 కోట్ల డాలర్లు జమ చేస్తూ అగ్రస్థానం ఆక్రమిస్తున్నారు. ఇది భారత స్థూల జాతీయోత్పత్తిలో నాలుగు శాతానికి సమానం. విద్యారంగానికి భారత్ కేటాయిస్తున్న నిధులకన్నా ఎక్కువ మొత్తమిది. విదేశాలకు వలస వెళ్లిన ఉన్నత విద్యావంతులు అక్కడ వృత్తి వ్యాపారాల్లో రాణించి ఆయా దేశాల ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్నారు. మాతృదేశ ఆర్థికవ్యవస్థలకూ ఊతమిస్తున్నారు. దీనికి చక్కటి ఉదాహరణ ఇజ్రాయెల్. కేవలం 71లక్షల జనాభా కలిగిన ఇజ్రాయెల్ నేడు జపాన్, బ్రిటన్, భారత్, చైనా, కొరియా, కెనడాలకన్నా ఎక్కువ అంకుర పరిశ్రమలను స్థాపించగలుగుతోందంటే అందుకు కారణం- విదేశీ నిపుణుల వలసలను స్వాగతించటమే.

ఈ తరహా ఆర్థిక వలసలతో శరణార్థులను పోల్చకూడదనే వాదం ఒకటుంది. కానీ యుద్ధాలు, రాజకీయ వేధింపుల వల్ల నిర్వాసితులైన పేద ప్రజలు చేయగలిగిన పనులూ చాలానే ఉన్నాయి. సంపన్న ఐరోపా దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. జనాభా తగ్గుతోంది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాల్లో యువజనులతోపాటు మొత్తం జనసంఖ్య పెరుగుతోంది. సంపన్న దేశాల ప్రజలు చేయడానికి ఇష్టపడని ఉద్యోగాలను వీరు భర్తీ చేయగలరు. వృద్ధులు పెరగడం వల్ల శ్రామికశక్తిలో ఏర్పడిన లోటునూ వర్ధమాన దేశాల వలసదారులు పూరించగలరు. 2035నాటికి ఒక్క జర్మనీకే 3.2కోట్లమంది వలస కార్మికులు అవసరమవుతారు. వీరిని తక్కువ నైపుణ్యం అవసరమైన పనుల్లో నియోగించవచ్చు. ఉక్రెయిన్, హంగరీ, పోలెండ్ వంటి తూర్పు ఐరోపా దేశాల నుంచి బ్రిటన్, జర్మనీలకు వలస వస్తున్నవారు మెరుగైన నైపుణ్యాలు కలవారు. ఐరోపా సమాఖ్య ఒప్పందం ప్రకారం వీరికి సాటి ఐరోపా దేశాల్లో ఉపాధిని పొందే హక్కు ఉన్నా, అక్కడ వీరి పట్ల వ్యతిరేకత పెరుగుతోంది. ఇదే బ్రెగ్జిట్ గొడవకు మూలకారణం! ప్రపంచీకరణ, అధునాతన టెక్నాలజీల వల్ల తమకు అవకాశాలు అడుగంటుతున్నాయని, తల్లిదండ్రులకు ఉన్న ఆర్థికభద్రత భావితరాలకు ఉండదని ఆందోళన చెందుతున్న సంపన్న దేశాల ఓటర్లు- వలసలను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఇదే ఐరోపా, అమెరికా రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. కార్ల్ బిల్ట్ చెప్పినట్లు- సంపన్న దేశాల్లో

ప్రపంచీకరణను ఆహ్వానించే స్వేచ్ఛావాదులకు, దాన్ని తిరస్కరిస్తూ లోలోపలికి ముడుచుకుపోయే సంకుచిత ధోరణులకు నేడు సైద్ధాంతిక సమరం నడుస్తోంది. నిజానికి 1951, 1967లలో కుదిరిన రెండు అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం– శరణార్థులకు రాజకీయా ఆశ్రయం కోరే హక్కుంది.

**అన్ని దేశాలకూ తాకిడి**

శరణార్థులంతా ఐరోపా, అమెరికాలకు మాత్రమే పరుగుతీయడం లేదని ఇక్కడ గమనించాలి. 70శాతం శరణార్థులు సాటి వర్ధమాన దేశాల్లోనే తలదాచుకుంటున్నారు. వీరిలో అత్యధికులు (25లక్షలు) టర్కీలో ఆశ్రయం పొందారు. పాకిస్తాన్‌కు 16లక్షల ఆఫ్ఘన్ శరణార్థులు చేరగా, లెబనాన్‌లో 11లక్షల మంది శరణార్థులు రక్షణ పొందుతున్నారు. దీంతో పోలిస్తే 2015లో 10లక్షలమంది శరణార్థులు, వలసదారులు ఐరోపా దేశాలకు చేరారు. వీరంతా టర్కీ, నైజర్, ఇటలీ, గ్రీస్ దేశాల మీదుగా ఉత్తర ఐరోపా దేశాలకు పయనిస్తున్నారు. పశ్చిమ ఆఫ్రికా వలసదారులు నైజర్ దేశం మీదుగా ఇటలీకి చేరుతున్నారు. ఐరోపా సమాఖ్య (ఈయూ) ఈ ప్రవాహాన్ని నిరోధించటానికి నైజర్‌కు 68 కోట్ల డాలర్లమేర నిధులిచ్చింది. టర్కీ కూడా అనేక రాయితీలు, నిధులు పొందింది. శరణార్థులపై టర్కీ ఇంతవరకు 800 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. శరణార్థులలో సగం బాలలేనని గుర్తించి వారికి రెండు లక్షల పాఠశాల ప్రవేశాలు కల్పించింది. లెబనాన్, జోర్డాన్ తదితర దేశాల్లో 2017నాటికి 10లక్షలమంది బాలలకు పాఠశాల చదువు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే నెలలో ఇస్తాంబుల్ నగరంలో జరిగిన ప్రపంచ మానవ కారుణ్య సభ వచ్చే అయిదేళ్లలో 385 కోట్ల డాలర్ల నిధులను సమీకరించి 1.36కోట్ల బాలలకు చదువు నేర్పాలని లక్షించింది.

శరణార్థుల సమస్యలకు అంతర్జాతీయ సమాజం దీర్ఘకాలిక పరిష్కారాలు కనుగొనాలి. ఐరోపా దేశాలు ఏటా మూడు లక్షలమందికి పునరావాసం కల్పించాలని వితరణశీలి జార్జి సొరోస్ సూచించారు. వారికి తగిన శిక్షణనిచ్చి ఉద్యోగాలు కల్పించడానికి వ్యాపార సంస్థలు నడుంబిగించాలంటున్నారు. ఐరోపా దేశాలకు మనుషులను అక్రమంగా తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా శరణార్థులు పయనించటానికి వీలుగా టర్కీ, గ్రీస్, నైజర్ వంటి దేశాలకు బడ్జెట్ నిధులు కేటాయించాలన్నారు. ఈ కృషికి రానున్న అయిదేళ్లలో ఏటా 4,500 కోట్ల డాలర్లు అవసరమవుతాయని సొరోస్ అంచనా. ఈ నిధుల సేకరణకు ఐరోపా ప్రభుత్వాలు బాండ్లు జారీ చేయవచ్చునని సూచిస్తున్నారు. ఇది ఆయా దేశాలకు ఆర్థిక ఉద్దీపనగా పనిచేస్తుందంటున్నారు. అన్నింటినీ మించి సిరియా, సోమాలియా, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల్లో శాంతి సుస్థిరతలను సాధిస్తే శరణార్థుల ప్రవాహం క్రమంగా తగ్గిపోతుంది. ఇందుకు ప్రపంచ నాయకులు కలిసికట్టుగా కృషి చేయాల్సి ఉంది!

(ఈనాడు సౌజన్యంతో) □

# శరణార్థులతో ఆర్థిక వ్యవస్థకు మేలే

శరణార్థులకు ఆశ్రయం ఇవటం వల్ల ముమ్ముందు యువ కార్మికశక్తి అందుబాటులోకి వస్తుందని జర్మనీ భావిస్తోంది. వయసు పెరుగుతున్న జనాభా ఎక్కువవుతున్న నేపథ్యంలో శరణార్థుల సంక్షోభాన్ని జర్మనీకి ఒక అవకాశంగా మలచుకునే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, డబ్బు రూపేణా సాయం పొందే శరణార్థులు కూడా తమకు ఆశ్రయం ఇచ్చిన దేశానికి గణనీయమైన బలాన్నిస్తారని ఓ అధ్యయనంలో గుర్తించారు. శరణార్థుల వల్ల ఒనగూరే ప్రయోజనాలు.. వారికి విరాళమిచ్చిన సాయంకన్నా గణనీయంగా అధికంగా ఉందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా–డేవిస్ (యూసీ డేవిస్) పరిశోధకులు పేర్కొన్నారు.

కాంగో శరణార్థులకు ఆశ్రయమిచ్చిన రువాండాలోని మూడు శరణార్థి శిబిరాల ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనంలో పరిశీలించారు. ఇందులో రెండు శిబిరాల్లోని శరణార్థులకు ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం నుంచి ఆర్థిక సాయం అందింది. అలాగే మూడో శిబిరంలోని శరణార్థులకూ అదే మొత్తంలో సాయం ఆహారం రూపంలో అందింది. ఈ మూడు శిబిరాల్లోని శరణార్థుల ప్రభావం ఆశ్రయమిచ్చిన దేశంపై ఎలా ఉందనే అంశంపై ఆ శిబిరాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో ఆర్థిక సర్వే నిర్వహించారు. ఆహార రూపంలో ఇచ్చిన సాయం కన్నా.. డబ్బు రూపంలో చేసిన సాయం ఆశ్రయమిచ్చిన దేశంపై అత్యధిక సానుకూల ప్రభావం చూపిందని కనుగొన్నారు. డబ్బు సాయం అందుకున్న శిబిరాల్లోని శరణార్థులు, అక్కడి వ్యాపారులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని వ్యాపారాలు, ఇళ్ల నుంచి వస్తువులు, సేవలు కొనుగోలు చేయడం ద్వారా ఆ ప్రాంతంలో తలసరి ఆదాయం గణనీయంగా అభివృద్ధి చెందడానికి దోహదపడ్డారని గుర్తించారు. ఆ ప్రాంతంలో వాణిజ్యం పెరగటం ద్వారా అక్కడి నుంచి మిగతా దేశంలోని వాణిజ్యానికి కూడా డిమాండ్ పెరిగిందని అధ్యయనం వివరించింది. □

# రాజకీయ ఇస్లామిజంపై నిజమైన ఇస్లాం గెలవాలి: జేపీ

హింస, విద్వేషం, వినాశనాన్ని ప్రోత్సహిస్తున్న రాజకీయ ఇస్లామిజంపై మానవీయత, సంయమనం, సమష్టితత్వాన్ని బోధించే ఆధునిక ఇస్లాంను గెలిపించే సంకల్పానికి ఈ ఈదుల్ ఫిత్ర్ నాంది పలకాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

**రమజాన్ మాసం ముగిసిన సందర్భంగా ముస్లింలకు, భారతీయులకు జేపీ ఈద్ ముబారక్ తెలియచేస్తూ..** సంకుచితత్వం నుంచి ఉదార విలువలు, స్వీయనియంత్రణ, సౌభ్రాతృత్వాల దిశగా మానసిక పరివర్తనకు రమజాన్ మాసం సంకేతమని, ఇస్లాం పేరుతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఏది నిజమైన ఇస్లాం, ఏది నిజమైన మతం అనే మానసిక యుద్ధం ప్రతి ముస్లిం, ప్రతి భారతీయుడి మదిలో మొదలవ్వాలని అన్నారు. టర్కీ, పాకిస్తాన్, సిరియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సూడాన్, లిబియా, యెమెన్.. ఇలా పలు దేశాల్లో పెద్దఎత్తున జరుగుతున్న హింసాకాండలో ముస్లింలే ఎక్కువగా నష్టపోతున్నారని, ఇస్లాం సమాజం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని అన్నారు. ఇది భారత్‌కు కూడా విస్తరించే ప్రమాదం ఉందని, గందరగోళంతో మరింత హింసను పెంచకుండా ప్రపంచ దేశాలన్నీ సమష్టి యుద్ధం చేసి ఉగ్రవాదంపై నిజమైన ఇస్లాంను గెలిపించాలని అన్నారు.

మతాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే వహాబిజాన్ని సౌదీ అరేబియా ప్రోత్సహించటం ప్రస్తుత ఉగ్రవాదానికి మూలం తప్ప ఇస్లాం అందుకు కారణం కాదని జేపీ అన్నారు. ఇస్లాంను వక్రమార్గం పట్టించి తమను వ్యతిరేకించినవారందరినీ చంపేయొచ్చంటూ తీవ్రవాదాన్ని ప్రోత్సహించే వహాబిజాన్ని రూపొందించిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్‌తో స్వార్థ రాజకీయాల కోసం అరేబియాకు చెందిన మహమ్మద్ సౌద్ క్రీ.శ 1744లో ఒప్పందం కుదుర్చుకున్నారని, సౌదీలోను ముస్లిం సమాజాల్లోను తమ ప్రాబల్యం కోసం తీవ్రవాదాన్ని పెంచి పోషించారని వివరించారు. అలా వహాబిజాన్ని ప్రోత్సహించిన సౌదీ అరేబియా మీద చమురు కోసం ఇతర దేశాలు ఆధారపడటం, అమెరికా, రష్యా సహా పలు సంపన్నదేశాలు అనాలోచితంగా, మూర్ఖంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి చోట ఆయుధాల రాజకీయాలు, యుద్ధాలు చేయటం ఈ పరిస్థితికి దారితీసిందని జేపీ అన్నారు. ఇంత చేసినా వహాబిజం ఒక పరిధి దాటి ఇస్లాంను ప్రభావితం చేయలేకపోతోందన్నారు. సౌదీ అరేబియాలో 25శాతం మాత్రమే వహాబిస్టులున్నారన్నారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డం పెట్టుకుని హింసను పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నందున ప్రపంచవ్యాప్తంగా అప్రమత్తమవ్వాలని, రాజకీయ, హింసాత్మక, ఉగ్రవాద ఇస్లామిజాన్ని నిజమైన ఇస్లాం మత విశ్వాసాల నుంచి



వేరుచేయాలని అన్నారు. భారత్‌లోని 16కోట్ల మంది ముస్లింల మనోభావాలను ఎట్టిపరిస్థితుల్లోనూ గాయపరచకుండా ఈ హేతుబద్ధ వాస్తవాల్ని వివరిస్తూ వారిని హింసకు వ్యతిరేక పోరాటంలో భాగస్వాముల్ని చేయాలని అన్నారు. వహాబిజం తప్పుల్ని ఎండగడుతూ సౌదీ అరేబియా చమురు మీద ఆధారపడకుండా ప్రత్యామ్నాయాలు చూసుకోవాలన్నారు.

**విద్య, ఆరోగ్యం, న్యాయ, పోలీసు సంస్కరణల్ని తేవాలి, ఉమ్మడి సివిల్ కోడ్ పట్ల ఏకాభిప్రాయం సాధించాలి**




రాజకీయ ఇస్లామిజం ఉగ్రవాదం ముంచుకొస్తున్న తరుణంలోనైనా మనదేశం తన అంతర్గత వైఫల్యాల్ని అంగీకరించాలని, సరైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు లేకపోవటం వల్ల ముస్లింలు సహా పలువురు యువత ఉగ్రవాదం పట్ల ఆకర్షితులవుతున్నారని గుర్తించాలని జేపీ అన్నారు. సకాలంలో తేలిగ్గా న్యాయం అందించే వ్యవస్థ లేకపోవటం వల్ల కూడా అమయాకులు ఉగ్రవాద అనుమానితులుగా బలవుతున్నారని భావిస్తున్న ఇస్లాంలోని పలువురు యువత మిగిలిన సమాజం పట్ల ద్వేషాన్ని పెంచుకుంటున్నారన్నారు. దీన్ని అడ్డం పెట్టుకుని కొందరు రాజకీయ నేతలు ఆధునిక చదువులొద్దు, ఛాందస భావాల్ని నేర్చుకోండి అంటూ హింసను రెచ్చ గొడుతున్నారన్నారు. సమష్టి పోరు, ఆధునిక ఇస్లాంపై చైతన్యం, ప్రజల్లో సామరస్యాన్ని పెంచటం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, పోలీసు, న్యాయ సంస్కరణల్ని తెచ్చుకోవటంపై దృష్టి పెడితేనే క్రమంగా ఉగ్రవాద సమస్యను పరిష్కరించుకోగలమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఉమ్మడి సివిల్ కోడ్ పట్ల నింపాదిగా అన్ని వర్గాలని విశ్వాసంలోకి తీసుకుని, ముందు ఏకాభిప్రాయాన్ని సాధించాలని, అందుకు లా కమిషన్ సూచనలను కోరటం సముచితమని జేపీ ప్రకటించారు. ◻

# సంస్కరణలతోనే సమన్యాయం!

- వరప్రసాద్

ఐక్యరాజ్యసమితి 1948లో మానవ హక్కుల ప్రకటన చేసినప్పుడు ఇస్లామిక్ సనాతనవాదులు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అల్లా వాణి అయిన షరియా కన్నా మానవుడి ఆలోచనలు, ఆవిష్కరణలు మిన్న కావని ఉద్ఘాటించారు. 1990లో ముస్లిం దేశాలు ఐరాస ప్రకటనకు పోటీగా 'ఇస్లాములో మానవ హక్కుల ప్రకటన'ను చేపట్టాయి. ఐరాస మానవ హక్కుల్లో అనేకానికి ఇస్లామిక్ ప్రకటన సమ్మతి తెలిపినా మతం, మతమార్పిడులు, లింగ సమానత్వం వంటి అంశాల్లో అసమానతలను యధాతథంగా కొనసాగించింది. ఆధునిక సమాజాల్లో పితృస్వామ్యం, పురుషాధిక్య ధోరణులు క్రమంగా తొలగిపోతున్నా- షరియా సూత్రాల్లో అవి పాతరూపంలోనే కొనసాగటం స్త్రీల పట్ల విచక్షణకు కారణమైంది. షరియా భాష్యకారులంతా పురుషులే కావడం ఈ విచక్షణను పెంచి పోషిస్తోంది. ఖురాన్ స్వేచ్ఛా న్యాయాలను, స్త్రీ పురుషులకు హుందాగా బతికే హక్కును మన్నిస్తున్నదనే వాస్తవాన్ని షరియా భాష్యకారులు విస్మరిస్తున్నారు. షరియాలో కాలానుగుణంగా మార్పులు తీసుకురావడానికి ససేమీరా అంటున్నారు. ఒక వ్యక్తి మత విశ్వాసాలను లేదా విశ్వాస రాహిత్యాన్ని సాకుగా చూపి ఆ వ్యక్తి మానవ హక్కులను కాలరాయడం నేరమని ఇరానియన్ తాత్వికుడు అబ్దుల్ కరీం సొరూష్ వ్యాఖ్యానించారు. అన్య మతస్తుల పట్ల ఇలాంటి నేరాలకు ఒడిగట్టిన ఉదంతాలు చరిత్రలో ఎన్నో చూశాం. కానీ, ఒక మతంలోని స్త్రీల హక్కులను అదే మతానికి చెందిన పురుషులు కాలరాయడం పెద్ద వైపరీత్యం. దీన్ని నేరంగా, రాజ్యాంగ, మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలని ముస్లిం మహిళలు డిమాండ్ చేస్తున్నారు.




షరియా సూత్రాల క్రోడీకరణకు సమయం

**హక్కుల కోసం పోరాటం**

ఆధునిక భారతదేశంలో ఇతర మతాల వనితలకు ఉన్న హక్కులు ముస్లిం స్త్రీకి లేకుండా పోయాయి. ముస్లిం వ్యక్తిగత చట్టం (పర్సనల్ లా)లో విడాకులు, బహుభార్యాత్వానికి సంబంధించిన సూత్రాల వల్ల మహిళలకు జరుగుతున్న అన్యాయం తరచూ న్యాయస్థానాల దృష్టికి వస్తోంది. మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా విడాకులు ఇవ్వడంలోని న్యాయబద్ధతను ప్రశ్నిస్తూ షయారా బానో అనే ముస్లిం మహిళ వేసిన పిటిషన్‌తోపాటు, మరో సుప్రీం మోటు పిటిషన్‌కూ స్పందించాలని కేంద్రాన్ని, అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డును, జాతీయ మహిళా సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటు 'మహిళలు-చట్టం' అనే అంశంపై ఓ ఉన్నతస్థాయి సంఘం రూపొందించిన నివేదికను తనకు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. విడాకులు, పిల్లల సంరక్షణ, వారసత్వం, అప్పులు ఆస్తుల పంపకానికి సంబంధించిన కుటుంబ చట్టాలను మదింపు చేసి ఉన్నతస్థాయి సంఘం సమర్పించిన నివేదిక అది. ప్రభుత్వం దాన్ని అంతవరకు బయటపెట్టలేదు. మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతిని, బహుభార్యాత్వాన్ని నిషేధించాలని ఉన్నతస్థాయి సంఘం సిఫార్సు చేసినట్లు తెలిసింది. ముస్లిం మహిళల హక్కుల రక్షణకు కొత్త చట్టాలను రూపొందించడానికి ఆ నివేదిక తోడ్పడవచ్చు.

పౌరుల పెళ్లి, విడాకులు, వారసత్వం తదితర కుటుంబ వ్యవహారాలను వారి వారి మతాలకు చెందిన వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లా) శాసిస్తాయి. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హిందూ సంప్రదాయవాదుల వ్యతిరేకతను లెక్కచేయకుండా 1950లలో హిందూ పర్సనల్ లాను ఆధునీకరించినా, ముస్లిం పర్సనల్ లాను మార్చలేకపోయారు. అది బ్రిటీషు వలస పాలన అవశేషంగానే కొనసాగుతోంది. ఈ అసంగతత్వాన్ని తొలగించి అన్ని మతాలవారికీ ఏకరూప వ్యక్తిగత చట్టం (యూనిఫాం సివిల్ కోడ్)ను రూపొందిస్తానని భారతీయ జనతా పార్టీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినా అది ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. యూసీసీ (యూనిఫాం సివిల్ కోడ్) రూపకల్పనకు పార్లమెంటును ఆదేశించాలని కోరిన ఓ ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబరులో తోసిపుచ్చింది. ఈ అంశం తన పరిధిలోకి రాదని పేర్కొంది. భారత ప్రజలందరికీ యూసీసీని వర్తింపజేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆదేశిక సూత్రాల్లోని 44వ అధికరణం సూచించినా, అది కేవలం మార్గదర్శక సూత్రమే తప్ప ప్రభుత్వం విధిగా అమలు చేయాల్సిన నియమం కాదు.

అయినప్పటికీ ప్రభుత్వం, న్యాయస్థానాలు తమ తమ పరిధుల్లోనే మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. కేవలం మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చేస్తామంటే కుదరదని, విడిపోవడానికి కారణాలేమిటో భర్త స్పష్టం చేయాలని 2007లో బొంబాయి హైకోర్టు ఆదేశించింది. 1985లో షా బానో కేసు ఎంతో సంచలనం సృష్టించింది. 43 ఏళ్ల కాపురం



'మహిళను పురుషుడి ఆస్తిగా పరిగణించడం అటు మానవ హక్కులకు కానీ, ఇటు ఇస్లామిక్ మతానికి కానీ అనుగుణమైనది కాదు. అది లింగ సమానత్వానికి పూర్తి విరుద్ధం కూడా'

\- షయారా బానో




## విడాకులు... కొత్త పోకడలు

1937 ముస్లిం పర్సనల్ లా (షరియా) వర్తింపు చట్టం ప్రకారం ఓ ముస్లిం భర్త 'ఏ రూపంలోనైనా' తలాక్ చెప్పవచ్చు. కాబట్టి స్కైప్, వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా కూడా విడాకులిచ్చేసే ధోరణి పెరిగిపోతోంది. భార్యాభర్తల తరఫున ఇద్దరేసి సాక్షుల సమక్షంలో 90 రోజులపాటు రెండు కుటుంబాలవారు రాజీకి ప్రయత్నించాలని ఖురాన్ నొక్కి చెబుతున్నా, దాన్ని పాటిస్తున్నవారు తక్కువే!

చేసిన తరువాత షా బానో భర్త ఆమెకు తలాక్ చెప్పేశాడు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం భర్త కొన్ని నెలలపాటు మనోవర్తి ఇస్తే సరిపోతుంది. కానీ, అన్ని మతాలకూ వర్తించే మనోవర్తి చట్టం కింద షా బానోకు నెలకు రూ.179 చొప్పున చిరకాలం మనోవర్తి చెల్లించాలని దిగువ కోర్టులు తీర్పు చెప్పాయి. దీన్ని సుప్రీంకోర్టు సమర్థించగా ముస్లిం సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. వారిని బుజ్జగించటానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం ముస్లిం మహిళల చట్టం తెచ్చింది. దీనిపై దుమారం రేగినా, ఈ చట్టంలో పొందుపరచిన ఒక సెక్షన్‌ను న్యాయస్థానాలు తెలివిగా ఉపయోగించుకుని ముస్లిం మహిళలకు న్యాయం జరిగేలా చూశాయి. పై చట్టంలోని 3(1)(ఎ) సెక్షన్ 'విడాకులిచ్చిన ముస్లిం భర్త తన భార్యకు సమంజసమైన, న్యాయమైన పరిమాణంలో మనోవర్తి చెల్లించాలి' అని నిర్దేశించింది. సార్వజనీన మనోవర్తి చట్టం కింద నెలకు గరిష్ఠంగా రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. కానీ, పై సెక్షన్ కింద న్యాయస్థానాలు ముస్లిం మహిళలకు అంతకన్నా ఎక్కువ మొత్తాలను మంజూరు చేసిన సందర్భాలు ఉన్నాయి.

తాజాగా సుప్రీంకోర్టు తలాక్ చట్టబద్ధతను పరిశీలించాలని నిర్ణయించడం ముస్లిం మహిళలకు ఆశాకిరణంలా కనిపిస్తోంది. 'మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతికి సౌదీ అరేబియా, ఇరాక్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో పరిమితులు విధించడమో లేక నిషేధించడమో జరిగింది. భారతదేశంలో మాత్రం ముస్లిం మహిళలు ఇప్పటికీ ఈ దురన్యాయానికి బలి అవుతున్నారు' అని షయారా బానో సుప్రీంకోర్టు ఎదుట మొరపెట్టుకున్నారు. ముస్లిం పర్సనల్ లా ఆమోదిస్తున్న తలాక్, బహుభార్యాత్వం వంటి దురాచారాలను నిషేధించాలని ఆమె కోరారు. ఇలాంటి దారుణాలు ఇంకా చాలానే జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లా కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ జహీరుద్దీన్ సిద్దిఖీ తన 47 ఏళ్ల భార్య అఫ్షా ఖాన్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో తలాక్ చెప్పారు. దీని మీద ఆవిడ అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాసినా, సిద్దిఖీ పంతం వీడలేదు.

### పర్సనల్‌లాకూ పరిమితులు


మానవ హక్కుల ఉద్యమకారిణి అయిన ఓ ముస్లిం మహిళకు విదేశాల్లోని ఆమె భర్త మొబైల్ సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) ద్వారా మూడుసార్లు తలాక్ చెప్పాడు. ముస్లిం న్యాయసూత్రాల ప్రకారం విడాకులకు ముందు మూడు నెలలు నిరీక్షణ వ్యవధి పాటించి, మధ్యవర్తుల ద్వారా సామరస్యానికి ప్రయత్నించాలి. కానీ, ఈ కేసులో అలాంటిదేమీ జరగలేదు. మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులివ్వడమనేది 14, 15, 21వ రాజ్యాంగ అధికరణలకు విరుద్ధమని షయారా బానో వాదించారు. దీనికి ప్రతిగా 'ముస్లిం పర్సనల్ లాకు దివ్య ఖురాన్ సూక్తులు, ప్రవక్త ప్రవచనాలే ఆధారం కాబట్టి అది లౌకిక చట్టాల పరిధిలోకి రాదు. దాన్ని ప్రాథమిక హక్కుల ప్రాతిపదికపై సవాలు చేయడానికి వీల్లేదు' అని ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించింది. ముస్లిం పర్సనల్ లాకు చట్టబద్ధతను చేకూర్చింది బ్రిటీషు కాలం (1937) నాటి లౌకిక చట్టమే తప్ప, ఇస్లాం మత గ్రంథాలు కావనే వాస్తవాన్ని బోర్డు విస్మరించింది. ముస్లిం పర్సనల్ లాలో బహుమతుల బదిలీ, వీలునామాలకు సంబంధించిన అంశాలకు ఇతర లౌకిక చట్టాలే భరోసా ఇస్తున్నాయి. మతపరమైన స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా గుర్తించే 25వ రాజ్యాంగ అధికరణ పరిధిలోకి పర్సనల్ చట్టాలూ వస్తాయి. కానీ, ప్రభుత్వం సాంఘిక సంస్కరణలు చేపట్టకుండా ఈ అధికరణ నిరోధించదు. ప్రభుత్వాల శాసన అధికారాల పరిధి నుంచి ఏ పర్సనల్ చట్టానికీ రాజ్యాంగం మినహాయింపు ఇవ్వలేదు. ఇప్పటికే ఇతర మతాల పర్సనల్ చట్టాలను క్రోడీకరించి చట్టరూపంలోకి తెచ్చినా ముస్లిం పర్సనల్ లాను మాత్రం ఇంతవరకు క్రోడీకరించలేదు. ఇక్కడ 'ప్రకాష్ వర్సెస్ ఫుల్వారీ' కేసును ప్రస్తావించాల్సి ఉంది. హిందూ వారసత్వ చట్టం కింద లింగ విచక్షణను ఈ కేసులో సవాలు చేశారు. గత ఏడాది అక్టోబరులో సుప్రీంకోర్టు ముందుకు ఈ కేసు వచ్చినప్పుడు ముస్లిం పర్సనల్ లా కింద ఇలాంటి లింగ విచక్షణను అనుమతిస్తున్నారని ప్రతివాది గుర్తుచేశారు. దాంతో ఈ అంశం మీద సుమో మోటు పిటిషన్‌ను సుప్రీంకోర్టు చేపట్టింది. ముస్లిం మహిళల పట్ల లింగ విచక్షణ 14, 15, 21వ రాజ్యాంగ అధికరణలకు, అంతర్జాతీయ నియమాలకు విరుద్ధమా కాదా అనే ప్రశ్నకు సమాధానమివ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. గత ఏడాది ఫిబ్రవరిలో మరో కేసు విచారణ సందర్భంగా 25వ రాజ్యాంగ అధికరణ మతస్వేచ్ఛకు భరోసా ఇస్తున్నదే తప్ప నైతిక, సామాజిక విలువలకు, ప్రజారోగ్యానికీ భంగకరమైన ఆచారాలను అనుమతించడం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బహుభార్యాత్వం ఒక సాంఘిక ఆచారమే తప్ప మత విశ్వాసం కాదు. ఏకపత్నీ వ్రతమనేది ఒక సాంఘిక సంస్కరణ. ఇలాంటి సంస్కరణలు తెచ్చే అధికారాన్ని 25వ రాజ్యాంగ అధికరణ ప్రభుత్వానికి కట్టబెట్టింది. మొత్తం మీద ముస్లిం పురుషులు విడాకులివ్వడానికి, బహుభార్యాత్వానికి షరియాను దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలు అనేకం. నిజానికి ముస్లింలలో వివిధ శాఖలకు వేర్వేరు షరియా సూత్రాలున్నాయి. దీంతో ఎవరికి అనుకూలమైన భాష్యాన్ని వారు చెప్పుకునే అవకాశం ఏర్పడింది. ఆధునిక కాలానికి అనుగుణంగా షరియా సూత్రాలను క్రోడీకరించి, వ్యవస్థీకరించడమే అసలైన పరిష్కారమవుతుందని ముస్లిం మహిళలు భావిస్తున్నారు.

(కర్టెసీ: ఈనాడు) □

# ఇలాంటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ప్రమాదం

- శేఖర్ గుప్తా

బ్రెగ్జిట్ పర్యవసానాలు ద్రవ్య మార్కెట్లపై చూపే ప్రభావం పట్ల ఆందోళనలకు పరిమితమై మనం ఆ పరిణామాన్ని సంకుచితమైన, ఏకముఖ దృష్టితో చూస్తూ తప్పు చేస్తున్నాం. లేదా, ప్రపంచీకరణను తిరగదోడి, తిరిగి పాత జాతీయవాదానికి తిరిగిపోవడంగా మాత్రమే దీన్ని చూస్తున్నాం. కానీ బ్రెగ్జిట్ (యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగటం) రాజకీయ పర్యవసానాలు అంతకంటే చాలా ప్రబలమైనవి, తీవ్రమైనవి. ఆగ్రహభరితమైన నేటి కాలంలో ఈ పరిణామం.. శతాబ్దాలుగా అభివృద్ధి చెందిన ఆధునిక, ప్రజాస్వామ్య రాజ్యపు అసలు పునాదినే సవాలు చేస్తుంది. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం కావాలని గావుకేకలు పెట్టే కొత్త ధోరణి ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉంది. కీలక నిర్ణయాలపై, సమస్యలపై తరచుగా ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టటం, ప్రజాప్రతినిధులను తిరిగి పిలిచే హక్కు, వ్యవస్థ సాధికారతను బలహీనపరచటం వంటివి ఇందులో ఉన్నాయి. ఇది అరాచకానికి మాత్రమే దారితీస్తుంది. ఢిల్లీకి రాష్ట్ర ప్రతిపత్తిపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అరవింద్ కేజ్రీవాల్ కోరడం గురించి కాదు నా ప్రధానమైన ఆందోళన. అదృష్టవశాత్తూ మన రాజ్యాంగం అందుకు అవకాశం కల్పించలేదు లేదా మనం మొట్టమొదటిసారిగా ఆ భావనను కాశ్మీర్‌లో పరీక్షించాలనీ అనుకోలేదు. ఆధునిక రాజ్యం విశ్వసనీయతను దెబ్బతీసే అంతకంటే పెద్ద ముప్పే ఇలాంటి ప్రజాభిప్రాయ సేకరణ వల్ల ఉంది.




### ప్రజాస్వామ్య పునాదికే చేటు

ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రత్యక్ష ఓటింగును నిర్వహించటం ప్రధానంగా యూరోపియన్ వ్యామోహం. అయితే అత్యంత కీలకమయిన ఒక అంశాన్ని నిర్ణయించడానికే కాదు, సర్వసత్తాకశక్తిగా దేశం కట్టుబడి ఉండాల్సిన అంశాలను నిర్ణయించడానికి కూడా దాన్ని ప్రయోగించటం ఇదే మొదటిసారి. పాఠశాల బోధనాంశాలకు, కొన్ని వివాదాస్పదమయిన జాతీయ స్థాయి పన్నులకు పరిమితమైతే ప్రజాభిప్రాయ సేకరణలు గమ్మత్తుగానూ, ముద్దుగానూ ఉంటాయి. ఇటీవల స్విట్జర్లాండ్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా మినార్ల వంటి నిర్మాణాలను నిషేధించటం పూర్తి అధికసంఖ్యాకవాదం, జాత్యహంకారపూరితం కాకున్నా మొరటుదనం. స్విట్జర్లాండ్ పలురంగాలలో ప్రపంచస్థాయిలో అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పి ఉండవచ్చు. కానీ అక్కడి ప్రజాస్వామ్యం స్త్రీలకు 1971లోగానీ ఓటుహక్కును ఇవ్వలేకపోయింది. అది కూడా పార్లమెంటు అలా నిర్ణయించాక 12 ఏళ్లకుగానీ అది జరగలేదు. బహుశా అంతా పురుషులతోనే జరిపే ప్రజాభిప్రాయ సేకరణ దాన్ని అడ్డు కుంటుందని భయపడటమే అందుకు కారణం కావచ్చు.

అతి భయంకరమైన వైరస్‌ల కంటే ఎక్కువ త్వరగా సోకే అంటువ్యాధులు చెడు భావాలు. ఇప్పటికే నెదర్లాండ్‌లో ఈయూపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. క్యుబెక్, స్కాట్లండ్‌ల వేర్పాటువాద ఒత్తిడులను కెనడా, బ్రిటన్‌లు ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి అపకేంద్రక ధోరణులు మరింత సంక్లిష్టమైన, వైవిధ్యభరితమైన ఇతర దేశాలకు కూడా విస్తరించగలుగుతాయి. సుస్థిరత, నమ్మకం ఉన్న ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం నిర్ణీతకాలంపాటూ అధికారంలో ఉండటం అనే పునాదిపై ఆధునిక ప్రజాస్వామ్యం నిర్మితమైంది. తరచుగా ప్రజాభిప్రాయ సేకరణల పేరిట జరిగే ఓటింగులు, అనూహ్యమైన అంతరాయాలు ఆ పునాదిని పూర్తిగా ధ్వంసం చేస్తాయి. ఏ ప్రభుత్వమైనాగానీ విశాల దేశ లేదా ప్రజాప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలను తీసుకోవడాన్ని అసాధ్యం అయ్యేలా చేస్తాయి. తమను ఎవరు పరిపాలించాలనే విషయంలో ఓటర్లకు అత్యున్నత నిర్ణయాధికారం ఉండగా.. రాజ్యాంగం, చట్టాలు, ప్రాథమిక సూత్రాలకు ఒక మేరకు స్థిరత్వం, (సృజనాత్మక) ఉల్లంఘనీయత ఉండటమే ఆధునిక ప్రజాస్వామ్యం గొప్పదనం. కాబట్టి ఆధిపత్యవాద అతిక్రమణలకు ప్రత్యక్ష ఓటు సాకుగా మారరాదు.

### మనదేశానికి అన్వయిస్తే...

అతిగా సరళీకరించిన ఉదాహరణలతో దీన్ని మరింత విప్లవకరంగా భారతదేశానికి అన్వయిద్దాం. ఢిల్లీ పూర్తి రాష్ట్ర స్థాయి అధికారాల కోసం ఓటింగ్‌ను నిర్వహిస్తుంది. తమిళనాడు తనను ఆర్టికల్ 370 జాబితా కిందకు తేవాలని లేదా 2010 నాటి రాళ్లు రువ్విన కాలపు ఆగ్రహావేశపూరిత క్షణాల్లో జమ్మూకాశ్మీర్ తనకు సర్వసత్తాకత కావాలని, పాకిస్తాన్‌లో భాగం

కావాలని 'ఎంచుకుంటే'నో? విదర్భ, బుందేల్‌ఖండ్ వాటికవే రాష్ట్రాలుగా ప్రకటించుకోవచ్చు. ఢిల్లీ దేశ రాజధాని కాబట్టి, యావద్భారతం దానికి ఒకప్పటి పూర్తి కేంద్రపాలిత రాష్ట్రస్థాయిని పునరుద్ధరించాలని కచ్చితంగా ఓటు చేస్తుంది. ప్రజల మానసిక స్థితులలోని ఊగిసలాటల వల్ల కలిగే అస్థిరత్వాన్ని నివారించడం కోసమే రాజ్యం అధికారాన్ని కచ్చితంగా నిర్వచించారు. సువ్యవస్థితం చేశారు. వాటికి పరిమితులున్నాయి. పక్షపాతరహిత సంస్థలైన కోర్టులు, ఎన్నికల కమిషన్, కాగ్, సీఐసీ తదితరాల ద్వారా ప్రధానంగా అవి అమలవుతుంటాయి. ప్రభుత్వం తమకు ఓటు చేయని, లేదా లెక్కలోకి రాని ఓట్లున్న వారి పట్ల వివక్ష చూపకుండా నివారించడం వాటి లక్ష్యం.

ప్రత్యక్ష ప్రజాస్వామ్యం నేడు ఒక ఉదారవాద ఉద్యమపు ప్రధాన నినాదంగా అవతరించింది. కాబట్టి ఇదీ ప్రశ్న: మీరు కోర్టు తీర్పును ఎంచుకుంటారా? అది జరగకపోతే భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377లోని కాలదోషం పట్టిన అంశాలకు పార్లమెంటరీ సవరణ కావాలా? లేక అయోధ్యలో ఆలయ నిర్మాణం కోసమూ, 370 అధికరణాన్ని, సింధు లోయ ఒప్పందాలను, సిమ్లా ఒప్పందాన్ని, తాష్కెంట్ ప్రకటనను రద్దు చేస్తూ ఓటింగ్‌ను నిర్వహించటం కావాలా? ఇవన్నీ ఒక పక్షానికి మొగ్గుచూపేలా ప్రేరేపించేవే. ఓటింగుకు పెడితే, రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితి అండతో అగ్రకుల ఉన్నతవర్గాలు తమకు కల్పించుకున్న విశేషహక్కులను కోల్పోవాల్సి వస్తుంది. మొత్తం జనాభాలో 20 నుంచి 25శాతంగా ఉన్న అగ్రకులాలకు తమకుతాముగా శాశ్వత 'ప్రతిభ'ను అంటగట్టేసుకుని అనుభవిస్తున్న అవకాశాలలో సగం మాత్రమే వారికి మిగులుతాయి. అవునూ, మీరు.. 2001 డిసెంబర్‌లో పార్లమెంటుపై దాడి తర్వాత లేదా 26/11 ముంబయి దాడుల తర్వాత వారంలోగా పాకిస్తాన్‌పై యుద్ధానికి పోవాలా, లేదా? అని జాతీయస్థాయి ఓటింగ్‌ను నిర్వహించేవారా? ఆ రెండు సందర్భాల్లోనూ నాటి ప్రభుత్వాలు ప్రజాగ్రహాన్ని విస్మరించి వివేకవంతమైన మార్గాన్ని అనుసరించాయి. నిర్ణీత పదవీకాలంపాటూ మనల్ని పరిపాలించాలని ప్రభుత్వంపై మనం విశ్వాసం ఉంచడమే సరిగ్గా అందుకు కారణం. ఈ అసంబద్ధత ఇలాగే సాగిపోతూ ఉండగలదు. ఓ సీనియర్ బీజేపీ ఎంపీ ట్విట్టర్లో రఘురాం రాజన్‌కు రెండో దఫా పదవి ఇవ్వాలా, వద్దా? అని ఓటింగ్‌ను నిర్వహించారు. "ఓటర్లు" అంతా ఆయన అనుచరులే. "వద్దు" అంటూ అత్యధిక ఆధిక్యతతో వారంతా ఓటింగ్ చేశారు. మరొక బీజేపీ రాష్ట్ర మంత్రి కూడా అలాగే పులికి బదులుగా ఆవును మన జాతీయ జంతువుగా గుర్తించాలంటూ ట్విట్టర్/ సోషల్ మీడియాలో ఓటింగ్ చేపట్టారు. భారీ ఆధిక్యతతో "ప్రజాభిప్రాయం" ఆవును ఎన్నుకుంది. వెర్రిబాగుల పులికి తాను తన స్థానాన్ని కోల్పోయానని తెలియనైనా తెలియదు.

**అరాచకం పరిష్కారం కాదు**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ప్రతిష్టంభనలో పడి, నిరుద్యోగం పెరుగుతుండగా పాత వ్యవస్థ పట్ల కొత్త అసంతృప్తి పెల్లుబుకుతోంది. కానీ పరిష్కారం అరాచకం కాదు. గతం పట్ల, "ప్రాచీనులు" చేసిన గొప్ప పనుల పట్ల కొత్త ఆకర్షణ పెరుగుతోంది. రోమన్ చక్రవర్తులు తమ నిర్ణయాలకు సమంజసత్వాన్ని కల్పించటం కోసం అలాంటి సర్కస్‌లను మహా సొగసుగా నిర్వహించగలిగినా కొంతవరకు ఈ ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని అమలుచేయగలిగారు. అయితే అంతకంటే ప్రాచీన కాలంనాటి వాటి గురించి కూడా చాలానే చెప్పారు. ప్రత్యేకించి మన వైశాలి అలాంటిదే. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు కార్లో పయనిస్తుంటే ప్రపంచంలోనే అత్యంత పురాతన ప్రజాస్వామ్యమైన వైశాలి ఆహ్వానం పలుకుతున్న బోర్డులు కనిపిస్తాయి. మగధ సైన్యాలు దండెత్తగా వైశాలి వారితో యుద్ధం చేయాలా, చేస్తే ఎప్పుడు, ఎక్కడ చేయాలని చర్చిస్తూ ఉండగానే.. మగధ సేనలు వైశాలిని ధ్వంసం చేసి ప్రజలను ఊచకోత కోశాయని చరిత్రకారులు చెబుతారు.

క్రీడలలో తరచుగా మనం విజయం చేతికి అందిందనగా కూడా ఓటమిని వరిస్తుండవచ్చు. భారతీయులకు ఇతరుల చర్చను లాగేసుకోవడం అనే ప్రత్యేకమైన, దీర్ఘకాలిక బలహీనత ఉంది. కష్టాలను ఎదుర్కొనే ధైర్యంలేని పిరికితనంతో బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరాన్.. ఈయూలో ఉండాలా, వైదొలగాలా? అనే చర్చపై తన సొంత పార్టీనే చీలిపోయేలా చేసే ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టారు. తన దేశాన్ని, యూరప్‌ను విఫలం చేశారు. మొత్తం ప్రపంచమే కదిలిపోయేలా చేశారు. ఆయన ఈ అంశంపై తన పార్టీలోనే ఓటింగ్‌ను చేపట్టి, మెజారిటీ "వదిలిపెట్టాలి" అంటే.. ఆ అంశంతో కొత్త ప్రణాళికను రూపొందించి తాజాగా ఎన్నికలను నిర్వహించటం మెరుగైనదై ఉండేది. ఇప్పుడాయన ఆపరేషన్ థియేటర్‌లో పేషెంట్‌ను పడుకోబెట్టి నిలువునా కోసేసి పారిపోయారు. ఇది ఏవిధంగానూ అనుసరించకూడని ఉదాహరణ.

తాజా కలం: 1974 పోఖ్రాన్-1 అణుపరీక్షకు "బుద్ధుడు నవ్వుతున్నాడు" అనే పేరు ఎందుకు పెట్టారు? చూడబోతే ఇందిరాగాంధీకి, ఆమె సలహాదారులకు కూడా మగధ, వైశాలిని ధ్వంసం చేసిన చరిత్ర తెలిసే ఉండాలి. బుద్ధుడు దాని పట్ల కలత చెందాడని, ఎవరూ కఠిన నిర్ణయాలను తీసుకోలేని ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి బదులు వైశాలికి కూడా ప్రతినిరోధకంగా పనిచేయగల సైనికశక్తి ఉండివుంటే అది ఈ విధ్వంసాన్ని నివారించగలిగేదని ఆయన భావించారనే గాథ ప్రచారంలో ఉంది. సైనిక శక్తిలోని అసమతూకం వల్ల కలిగే ప్రమాదాల గురించి బుద్ధుడు కలతచెందారు. భారత్ ఎట్టకేలకు సైనికపరమైన ప్రతినిరోధక శక్తిని సాధించిందని విన్నప్పుడు ఆయన నవ్వకపోతే ఏం చేస్తాడు?

(కర్టెసీ: సాక్షి) □

# మోదీగారి 'సంజయ్ గాంధీ'

- రామచంద్ర గుహ,
చరిత్రకారుడు



నాతో సహా పలువురు వ్యాఖ్యాతలు నరేంద్రమోదీని ఇందిరాగాంధీతో పోల్చారు. మోదీ నిశ్చయంగా ఇందిర అనంతరం అత్యంత అధికార పూర్వక ప్రధాన మంత్రి. పూర్తికాలం పదవిలో ఉన్న మరో ఇద్దరు ప్రధాన మంత్రులు వాజపేయి, నరసింహారావు కంటే కూడా మోదీ అత్యంత సాధికార ప్రధాని అనటంలో సందేహం లేదు.

ఇందిర మాదిరిగానే మోదీ కూడా ఒంటరి వ్యక్తి. బహుశా ఆయన ఏకైక ఆంతరంగికుడు, ఒక విధంగా తనతో సమానుడుగా పరిగణించే ఏకైక వ్యక్తి అమిత్ షా. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిఆ ఉన్నప్పుడు షాకు మొత్తం పన్నెండు మంత్రిత్వశాఖల బాధ్యతలు అప్పగించారు. 2014 సార్వత్రిక ఎన్నికలకుగాను బీజేపీ ప్రధాని అభ్యర్థిగా తాను ఎంపికయినప్పుడు ఎన్నికల ప్రచారంలో షాకు కీలకపాత్ర ఇవ్వాలని మోదీ డిమాండ్ చేశారు. ఇందుకు పార్టీ అంగీకరించటంతో, కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అభ్యర్థుల ఎంపిక, ప్రచార కార్యక్రమాలు పూర్తిగా షా పర్యవేక్షణలో జరిగాయి. 2014 జులైలో మోదీ విజ్ఞప్తి లేదా ఆదేశం మేరకు అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.


నరేంద్ర మోదీ రాజకీయ వ్యవహారాలలో సంపూర్ణంగా విశ్వసించే ఒకే ఒక వ్యక్తి అమిత్ షా. ఇందిరా గాంధీ నిజంగా విశ్వసించిన (కనీసం 1975-80 సంవత్సరాల మధ్య) ఒకే ఒక వ్యక్తి సంజయ్ గాంధీ. తమ ప్రధాన సలహాదారు, హితుడు, అనుయాయుల మధ్య ఎంపికలో ఇందిర, మోదీ మధ్యం ఇంకా పోలికలను మనం చూడగలమా? చూడగలమని నేను భావిస్తున్నాను. ఇందిర, సంజయ్‌ల మధ్య ఉన్నవిధంగా మోదీ, షాల మధ్య ఎటువంటి రక్తసంబంధం లేదు. అయితే తల్లీతనయుల, మోదీ-షాల మధ్య కొట్టవచ్చినట్టు కొన్ని స్వామ్యాలు కనిపిస్తాయి. అవి చరిత్రకారునికి ఆసక్తికరమైనవే అయినా పౌరునికి చాలా కలవరం కలిగించేవి సుమా.



చాలామంది రాజకీయ వేత్తలకు ఆకాంక్షలు అనేకముంటాయి. కొన్ని సందర్భాలలో అవి ఒకదానితో ఒకటి సంఘర్షించుకుంటాయి. సాధ్యమైనంతకాలం ప్రధాని పదవిలో ఉండిపోవాలని ఇందిర ఆశించారు. అయితే భారత ప్రజల జీవన స్థితిగతులలో మేలు మార్పులు తీసుకురావాలి, చరిత్రపై తన ముద్ర శాశ్వతంగా ఉండాలని కూడా ఆమె గట్టిగా కోరుకున్నారు. మోదీ కూడా అధికారం, కీర్తిప్రతిష్ఠలు సమకూర్చుకోవడం కంటే దేశానికి శాశ్వత ప్రయోజనం కల్గించే పనులు చేయాలని ప్రగాఢంగా కోరుకుంటున్నారు. సంపద్వంతమైన, శక్తిమంతమైన భారత్ గురించిన మోదీ భావన, ఇందిర లేదా నెహ్రూల భారత్ భావనకు భిన్నమైనది. అయితే వ్యక్తిగత ఆకాంక్షలకు అతీతంగా దేశ భవిష్యత్తు గురించి మోదీకొక స్పష్టమైన దార్శనికత లేదనడం చాలా మొరటు అభిప్రాయమే అవుతుంది.

అమిత్ షాకు, గతంలో సంజయ్‌గాంధీకి వలే అధికారమే ప్రేరణ శక్తిగా ఉన్నట్లు కన్పిస్తోంది. ఇందిరాగాంధీ రెండో కుమారుని రాజకీయ కార్యకలాపాలను అభివర్ణించటంలో మనస్సుకు తట్టే ఒక మాట ఏకాగ్రదృష్టిగల వ్యక్తి. మరో పదం నిర్దయుడు. అత్యవసర పరిస్థితి కాలంలో ఈ రెండు లక్షణాలు సంజయ్‌లో స్పష్టంగా కనిపించాయి. ఆ చీకటి రోజుల్లో తన లక్ష్యాలను సాధించుకోవడంలో సంజయ్ పూర్తి ఏకాగ్రత దృష్టితో పనిచేశారు. అలానే ఎంతమాత్రం కనికరం లేకుండా వ్యవహరించారు.

సంజయ్ గాంధీ పెడదారి పట్టిన యువకుడని, కాబట్టి దుందుడుకుతనంతో వ్యవహరించేవాడని కొంతమంది వ్యాఖ్యాతలు భావించారు. నిజానికి ఆయన రాజకీయ వ్యవహారాలలో ఘటనాఘటన సమర్థుడు. ఇందిరాగాంధీ తన మనస్సాక్షి ప్రబోధం మేరకు అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించకుండా ఉన్నట్లయితే (గమనార్హమైన



విషయమేమంటే ఇది ఆమె తన కుమారుడిని సంప్రదించకుండా సొంతంగా తీసుకున్న నిర్ణయం) నియంతృత్వపాలన మరికొంతకాలం బహుశా సుదీర్ఘకాలం కొనసాగివుండేది. 1980 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ ప్రచారోద్యమానికి సంజయ్ సారథ్యం వహించారు. అది ఆయన వ్యక్తిగతంగా పర్యవేక్షించిన ఏకైన ఎన్నికల ప్రచారోద్యమం. ఆ ఎన్నికలలో ఆయన పార్టీకి ఘనవిజయం లభించింది.

ఏకాగ్రదృష్టితో, నిర్దయుడు అనే మాటలు అమిత్‌షాకు కూడా పూర్తిగా వర్తిస్థాయి. గుజరాత్‌లో మంత్రిగా ఆయన నిర్వహించిన పాత్రను వదిలివేసి (ఆసక్తివున్న పాఠకులు రాణా ఆయ్యూబ్ రచించిన 'ది గుజరాత్ ఫైల్స్' అనే పుస్తకాన్ని చూడవచ్చు) రాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాలలోకి వెళ్లిన తరువాత ఆయన ఏమి చేశారన్న దాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుందాం. 2014 సార్వత్రిక ఎన్నికలలో ఆయన పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఉద్దేశపూర్వకంగా ఓటర్ల మధ్య చీలికలు సృష్టించారు. 'బ్యాలెట్ బాక్స్ ద్వారా ప్రతీకారం తీర్చు కోవాలని' హిందువులకు షా విజ్ఞప్తి చేశారు. అమిత్ షా చలవతో ఉత్తరప్రదేశ్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన యోగి ఆదిత్యనాథ్, సాక్షి మహరాజ్, సంజీవ్ బలియాన్ తదితరులు చాలా విద్వేషపూరితమైన, మతోన్మాద ప్రకటనలు చేశారు. పార్టీ అధ్యక్షుడుగానీ, ఆ మాటకొస్తే ప్రధానమంత్రిగానీ వారిని అదుపుచేయడం లేదు.

ఇందిరాగాంధీ పుత్రప్రేమతో సంజయ్ అక్రమాలను పట్టించుకోలేదు. అమిత్‌షా విషయంలో మోదీకి ఇటువంటి అనుబంధాలేవీ లేవు. అయినా అమిత్‌షా అనుసరిస్తున్న రాజకీయ పద్ధతులను మోదీ ప్రశ్నించటం లేదు. సంజయ్‌ను ఇందిర విశ్వసించిన విధంగా షాను మోదీ విశ్వసిస్తున్నారు. రాజ్యసభలో తమ పార్టీ సంఖ్యాబలాన్ని పెంపొందించుకోవడానికి అమిత్‌షా అనుసరిస్తున్న రాజకీయ పద్ధతులు తోడ్పడతాయని మోదీ భావిస్తున్నారా? మరి షా రాజకీయాలకు బాధితులవుతున్న ఉత్తరప్రదేశ్ ప్రజలను పట్టించుకునేదెవరు?

లక్ష్యాలు ఎంత ఉత్తమంగా ఉండాలో వాటిని సాధించే మార్గాలు అంత ఉత్తమంగా ఉండాలని మహాత్మాగాంధీ తరచు అనేవారు. అంతిమలక్ష్యం ప్రజల సంక్షేమమే అయినప్పుడు అందుకు సూత్రరహిత మార్గాలను అనుసరించినా తప్పులేదని మన రాజకీయ వేత్తలు భావిస్తున్నారు.




ఇందిరాగాంధీ, నరేంద్రమోదీ ఇరువురూ తమ స్వార్థానికి మహాత్మాగాంధీ సన్నిహిత రాజకీయ శిష్యులు ఆమోదించలేని పద్ధతులను ఉపయోగించుకున్నారు. అధికారాన్ని గెలుచుకోవడానికి ఇతర పార్టీల నాయకులపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం, అధికారంలో ఉండగా తమ ప్రాముఖ్యతను మరింత పెంపొందించుకోవడానికి కేబినెట్ సహచరులకు ప్రాధాన్యాన్ని తగ్గించడం మొదలైనవన్నీ ఈ అనైతిక పద్ధతుల్లో భాగమే.

మరో శ్రేణి రాజకీయ వేత్తల గురించి కూడా ఇక్కడ చెప్పవలసివున్నది. వీరు నీతిబాహ్యులు. వీరి లక్ష్యాలూ ప్రజలకు మేలు చేసేవేమీ కావు. మనదేశంలో రాష్ట్ర స్థాయి రాజకీయాలు ముఠానాయకులు, హంతకులతో నిండిపోయి వున్నాయి. వీరే శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవుతూ తమ వ్యక్తిగత ప్రయోజనాలు కాపాడుకుంటున్నారు. అవినీతిపరులైన వ్యాపారవేత్తలు డబ్బు వెచ్చించి రాజ్యసభ సీటు కొనుక్కుంటున్నారు. అయితే అధికారాన్ని సముపార్జించుకోవడానికి, అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఎటువంటి పద్ధతులనైనా ఉపయోగించుకొనేందుకు వెనుకాడని (అఖిలభారత స్థాయి) నాయకులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. గతంలో సంజయ్ గాంధీ, ఇప్పుడు అమిత్‌షా. ఈ కారణంగానే సమకాలీన చాణక్యుడని బీజేపీ అధ్యక్షుడికి కొందరు చేస్తున్న కీర్తిగానం చాలా నిరుత్సాహం కలిగిస్తోంది. వాస్తవమేమిటి? ఇందిరాగాంధీ రెండో కుమారుడు మరణించిన నాటి నుంచి ఒక ప్రధాన జాతీయపార్టీ అగ్రనాయకుడు ఒకరు రాజకీయ కార్యాచరణలో నైతికాంశాలను పూర్తిగా ఉపేక్షించడాన్ని దేశప్రజలు ప్రప్రథమంగా చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ◻

# దాహార్తులు - జల విలాసాలు

- మహేష్ విజాపుర్కార్




దాహంతో తల్లడిల్లుతున్న పశ్చిమ మహారాష్ట్రలోని లాతూరు గొంతు తడపటానికి 50 ట్యాంకర్లతో నీటిరైలును నడిపారు. మీరజ్ నుంచి బయల్దేరే నీటి రైలు అక్కడికి 300 కిలోమీటర్ల దూరంలోని లాతూరు దాహార్తిని తీర్చాలి. అక్కడి నీటి సంక్షోభంతో పోలిస్తే దూరాలు కుదించుకుపోవాల్సిందే. విస్తృతమైన మీడియా ప్రచారం వల్ల లాతూరు అంటేనే మొత్తం మరత్వాడా ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి కొరతకు సంకేతంగా మారింది. అలా అని ఆ ప్రాంతంలోని ఇతరచోట్ల సమస్య తక్కువగా ఉన్నదనేమీ కాదు.

ఈ నీటి ఎద్దడి దృష్ట్యానే ఐపీఎల్ క్రికెట్ పిచ్, ఔట్‌ఫీల్డులను చక్కగా ఉంచటం కోసం రోజుకు 60,000 లీటర్ల నీటిని వాడటం ఆలోచనాపరులకు ఆగ్రహాన్ని కలిగించింది. పొరుగింట్లో చావు జరిగితే, చాలాకాలం సన్నాహాలు చేసుకున్న పెళ్లింటివారు సైతం వివాహ వేడుకల జోరును తగ్గించే చర్యలను చేపడతారు. అలాంటి సున్నితత్వం బీసీసీఐకి కొరవడింది. క్రిస్టఫర్ కోనీ, థామస్ హార్డీ రాసిన మేయర్ ఆఫ్ కాస్టర్‌బ్రిడ్జిలోని ఒక రైతు పాత్ర. చనిపోయిన మేయర్ శవం నుంచి కొన్ని నాణేలను దొంగిలించి, తాగుడుకు తగలేస్తూ అతగాడు పట్టుబడతాడు. అప్పుడిక కోనీ "మరణం, నాలుగు పెన్నీల జీవితాన్ని ఎందుకు హరించాలి? చావనేది, అంతగా గౌరవించాల్సినదేమీ కాదే?" అంటూ తత్వం మాట్లాడతాడు. జీవితం కొనసాగించాల్సిందేనని అతగాడి భావం. నిజమేగానీ, కాస్త జోరు తగ్గించి మెల్లగా సాగించాల్సి ఉంటుంది. ఈ విషయంలోనే బీసీసీఐ విఫలమైంది.

మొదటి మ్యాచ్‌ని జరుపుకోడానికి హైకోర్టు అనుమతించింది. అయితే అంతకు ముందు అది, తీవ్ర నీటిఎద్దడితో అల్లాడుతున్నవారందరి పట్ల తగు స్పందనను చూపింది. ఆ సమస్యను ఉపశమింప చేస్తామనే మాటలతో సరిపెట్టుకోక, తగు చర్యలు అమలయ్యేలా చూశాకనే అనుమతిని మంజూరు చేసింది. ముంబయి నగర నీటి నిర్వహణను గురించి కోర్టు అడిగి తెలుసుకుంది. దాన్ని ప్రతి గ్రామానికి, పట్టణానికి, నగరానికి వర్తింపచేయాలి. ఒక దశలో రాష్ట్ర ప్రభుత్వం, ఈ సమస్య పౌర పరిపాలక సంస్థ తలనొప్పే తప్ప తమది కాదని సైతం చెప్పింది. దాని మాటలే కాదు, ఆ తర్వాత బీసీసీఐ ప్రభుత్వంతో అన్న మాటలు కూడా బుద్ధిహీనమైనవే. ఐపీఎల్ కోసం తాము ఉపయోగించుకునే నీటికి, అది కోల్పోవాల్సి వచ్చే పన్నులకు మధ్య ఏంకావాలో తేల్చుకోవాలని బీసీసీఐ మొరటుగా ప్రభుత్వానికి చెప్పింది. ఐపీఎల్ వల్ల రూ.100కోట్ల పన్నులు వస్తాయంటూ కూడా అది లెక్కలు కూడా చెప్పింది. అదెలాగో అర్థం కాదు. ఒకవేళ బీసీసీఐ, ఐపీఎల్‌లు తమకు వచ్చే రాబడి గురించి మాట్లాడలేదు గదా!? ఇంతకు మించిన తలబిరుసుతనం మరొకటి ఉండదు. "మ్యాచ్‌లను మహారాష్ట్ర బయటకు తరలించినా ఫర్వాలేదు" అంటూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆచితూచి సమాధానం చెప్పారు.

అత్యున్నత అధికారస్థానంలో ఉన్న వ్యక్తి చెప్పగలిగిన దాని కంటే అది చాలా బలహీనమైన సమాధానం. డబ్బు శక్తి ప్రభుత్వాన్ని సైతం ఎంతగా అణగిమణగి ఉండేలా చేయగలదో ఇది సూచిస్తుంది. బీసీసీఐ ప్రభుత్వ సంస్థేమీ కాదు, ప్రయివేటు కార్పొరేటు సంస్థ. కనీసం అది పారదర్శకతకు, జవాబుదారీతనానికైనా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు దానికి గుర్తుచేస్తోంది. బీసీసీఐని సంస్కరించాలని అది కోరవచ్చుగదా అనొచ్చు. అదే జరిగితే, అలాంటిదేమీ అవసరంలేదనే వాదనలతో న్యాయవ్యవస్థను అది ఎదుర్కొంటుంది.

నీటి వినియోగం సున్నితమైన అంశం. కానీ మనలో చాలామందిమి నీరు పుష్కలంగా, శాశ్వతంగా లభిస్తుందన్నట్టు ప్రవరిస్తున్నాం. హైదరాబాద్‌లో ఒకవంక జీవజలం కోసం

మునిసిపల్ ట్యాంకర్లపై ఆధారపడుతుండగా, మరోవంక మహోత్సాహంగా షవర్ కింద చివరి నీటిబొట్టు అయిపోయే వరకు జలకాలాటలు సాగుతూనే ఉంటాయి. చివరికి పౌర పరిపాలక సంస్థ అధ్వాన్న నిర్వహణను తిట్టిపోస్తారు. మహారాష్ట్రలో సాధారణంగా తలెత్తుతుండే నీటికొరతల సమయంలో ట్యాంకర్లు వచ్చేది మాఫియాల నుంచే తప్ప పౌర పరిపాలక సంస్థ నుంచి కాదు. నీటి ట్యాంకర్లు నడిపితే నాలుగు డబ్బులు సంపాదించవచ్చని లాతూరులో ఉద్యోగాలు మానేస్తున్నారు.

బీసీసీఐ, ఐపీఎల్‌ల నీటి వినియోగానికి వ్యతిరేకంగా హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం నేపథ్యాన్ని చూడండి (లోక్‌సత్తా దీన్ని దాఖలు చేసింది). ఒకటి, విద్యార్థులు తమ నీటిని తామే తెచ్చుకోవాలని ప్రభుత్వం నడిపేవాటితో సహా పలు పాఠశాలలు కోరాయి. స్కూలు బ్యాగు బరువుకు మరింత బరువు. రెండు, దియోనార్ చెత్త డంపింగ్ యార్డులో చెలరేగిన మంటల వల్ల నగరాన్ని రెండు రోజుల తరబడి పొగ చుట్టేసింది. ఆ మంటలను చల్లార్చటానికి తాగునీటిని వాడాలా, లేదా? అని స్థానిక పౌర పరిపాలక సంస్థలోనే చర్చ జరిగింది. అయినాగానీ, ఈ కేసు విచారణ సమయంలో పిటీషనరు, న్యాయమూర్తులు తప్ప మరెవరూ నీటి వినియోగం పట్ల పట్టింపును చూపలేదు. ఒక సందర్భంలో వారు దీన్ని "నేరపూరితం" అని సైతం అన్నారు. ఏదేమైతేనేం, చివరిక్షణం వరకు మ్యాచ్‌లను మార్చడం సులువేమీ కాదని బీసీసీఐ, ఐపీఎల్ అధిపతులు పట్టుబట్టారు. గొప్ప కార్పొరేట్ సామాజిక బాధ్యతను నిర్వర్తించలేకపోతాం అన్నట్టుంది వారి వైఖరి. వారే అభ్యంతరం తెలపకపోయి ఉంటే, నీరు జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అత్యంత విలువైన వనరు అనే సందేశం నీటిని ఉపయోగించుకునే ప్రతివారికీ చేరేది. మరీ ముఖ్యంగా బీసీసీఐ ఉపయోగించే ట్యాంకర్ల నుంచి పొంగిపొర్లే రెండు తొట్టెల నీటితో రోజంతా ఎనిమిదిమందికుటుంబం గడపాల్సివస్తున్న పరిస్థితుల్లో అది మరింత అవసరం. ఆ ట్యాంకర్ల డ్రైవర్లు బీసీసీఐ వారు కాదు కాబట్టి, బహుశా వాళ్లు సైతం నీటి కొరతతో అల్లాడుతుండొచ్చు.

(సాక్షి సౌజన్యంతో) ◻

# భారత్‌లో నీటికొరత పెరగబోతోంది



భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో నీటికొరత కారణంగా ఘర్షణలు తలెత్తుతాయని ప్రపంచబ్యాంకు హెచ్చరించింది. వృద్ధిపై ప్రభావం చూపుతుందని, వలసలకు కారణమవుతుందని తెలిపింది. 'హై అండ్ డ్రై: క్లయిమేట్ ఛేంజ్, వాటర్ అండ్ ఎకానమీ' పేరుతో ప్రపంచబ్యాంకు నివేదికను విడుదల చేసింది. పెరుగుతున్న పట్టణీకరణ, సౌకర్యాలతో నీటి అవసరాలకు డిమాండ్ పెరుగుతుందని సరఫరా మాత్రం అస్తవ్యస్తంగా, అనిశ్చితితో ఉంటుందని పేర్కొంది. ముఖ్యంగా భారత్‌లో నీటి వినియోగంలో సమర్థ విధానాలను అవలంబించాలని స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా నీటికొరత పెరుగుతుందని తెలిపింది. గుజరాత్‌లో భూగర్భ జలమట్టం తగ్గిపోవటంతో రైతులు మరింత సమర్థవంతమైన సాగు సాంకేతిక పరిజ్ఞానాలు ఉపయోగించటానికి, ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయటానికి బదులు నగరాలకు వలస వెళ్తున్నారని నివేదిక వివరించింది.

భారత్‌లోని మొత్తం కర్బన ఉద్గారాల్లో భూగర్భ జలపంపింగ్ వాటా నాలుగు నుంచి ఆరు శాతం దాకా తక్కువగా ఉందని అంచనా. సగటు వర్షపాతం కన్నా తక్కువ నమోదయినప్పుడు భారత్‌లో ఆస్తుల సంబంధిత హింస నాలుగు శాతం పెరుగుతుంది. వరదల తర్వాత మతపరమైన అల్లర్లు తరచూ జరుగుతుంటాయి అని నివేదిక విశ్లేషించింది. నీటికొరత సమస్యను వాతావరణ మార్పు మరింత సంక్లిష్టం చేస్తోందని ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ చెప్పారు. జలవనరులను మెరుగ్గా నిర్వహించేందుకు ఆయా దేశాలు చర్యలు తీసుకోనట్టయితే ఎక్కువ జనాభా ఉన్న కొన్ని ప్రాంతాలలో దీర్ఘకాలంపాటు ప్రతికూల వృద్ధి కొనసాగే అవకాశముందన్నారు. "నీరు సహజ వనరు అనే విషయాన్ని మనం మరువకూడదు. జల చక్రాన్ని, నీరు ఎటు ప్రవహించి ఎక్కడకు చేరాలో నియంత్రించే అడవులను మనం నిర్లక్ష్యం చేస్తే పరిస్థితిని మనం మరింత దిగజార్చినట్టే. భారత్‌కు ఇది బాగా వర్తిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

కరవుల కారణంగా పెరిగే ఆహారధరల వల్ల ఘర్షణలు మరింత పెరగవచ్చని వలసలకు దారితీయవచ్చని నివేదిక వెల్లడించింది. వర్షపాతంతో ఆర్థికాభివృద్ధి ప్రభావితమైన చోట కరవులు, వరదలు వలసలను సృష్టించాయని, హింసను ప్రజ్వలింప చేశాయని తెలిపింది. తగిన చర్యలు తీసుకోకపోతే నగరాలలో నీటి లభ్యత 2015తో పోలిస్తే 2050లో మూడింట రెండొంతులకు తగ్గుతుందని నివేదిక హెచ్చరించింది. ◻

# డెల్టాలో ఇంకుడు గుంతలా!

ఆంధ్రప్రదేశ్‌లో ఇంకుడు గుంతల్ని నిర్మించేందుకు పెద్దఎత్తున ప్రచారంతో ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వం ఇందుకు గణనీయంగా నిధుల్ని కేటాయిస్తున్నట్టు సమాచారం. అయితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ ఇంకుడు గుంతలు పనికిరావని భూభౌతిక శాస్త్రవేత్తలు (జియోఫిజిసిస్టులు) చెబుతున్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని సరైన అధ్యయనంతో రూపొందించి అమలుచేస్తే తక్కువ ఖర్చుతో మరింత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ఆంధ్రప్రదేశ్ మొత్తంలో భూగర్భ జలాలను పెంచటానికి భౌగోళికతకు తగ్గట్టు ఎలాంటి పరిష్కారాన్ని అనుసరించాలో రాష్ట్ర ప్రభుత్వం లోతుగా పరిశీలించి శాశ్వత ప్రాతిపదికన చర్యల్ని వేగంగా తీసుకోవటం అవసరం.

ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూపస్వభావాలు ఒకే రీతిలో లేవని మొట్టమొదట గుర్తించాలి. ఎత్తయిన ప్రాంతాలు ఎక్కువగా ఇసుకతో ఉండగా, డెల్టా ప్రాంతం అక్కడక్కడా ఇసుక పొరలున్న రేగడి మట్టితో ఉంటుంది. ఇంకుడు గుంతల్ని ఎత్తయిన, మెరక ప్రాంతాలలో నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఎలాంటి చోటైనా భూగర్భ జలమట్టాలను పెంచాలంటే, ఇంకుడు గుంతల్ని భూమిలో మొదటి నీటి ఫలకం దాకా తవ్వాలి. సాధారణంగా ఇది 25 అడుగుల లోతు ఉంటుంది. కాబట్టి, రేగడి మట్టి ఉండే డెల్టా ప్రాంతంలో 2-3 మీటర్ల లోతులో ఇంకుడు గుంతల వల్ల ఫలితం ఉండదు. ఈ గుంతల్లో నిల్వ చేసే వాన నీరు మందపాటి మట్టి పొర వల్ల ఇసుక జోన్‌లోకి చొరబడలేదు. కాబట్టి చివరికి ఇది దోమల్ని పెంచటానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

డెల్టా ప్రాంతంలో ప్రధాన సమస్య భూమి ఉపరితలం మీద, దిగువన మురుగునీటి పారుదల. డెల్టా ప్రాంతంలో కొన్ని చోట్ల పల్లం బాగా తక్కువగా ఉండటమో లేదా అసలే లేకపోవటమో ఈ సమస్యకు కారణం. కాబట్టి ఇసుక బాగా పేరుకుపోయిన సముద్ర తీర ప్రాంతాల్లో మినహాయించి డెల్టాలో ఇంకుడు గుంతలు అనవసరం. తగినంత పల్లం లేకపోవటం వల్ల డెల్టా ప్రాంతంలో భూమ్మీదగానీ, దిగువన భూమి పైపొరల్లోగానీ నీరు నిల్వ ఉంటుంటుంది.

ఇటువంటి పరిస్థితుల్లో ఇంకుడు గుంతల్ని నిర్మిస్తే ఇప్పటికే ఉన్న మురుగు నీటి పారుదల సమస్య ఇంకా పెరుగుతుంది. ఇలా నీరు నిల్వఉండటం, భూగర్భ జలాల్ని సాధారణం కంటే పెంచటం వల్ల డెల్టాలో జల భూ రసాయన





చర్యలు చోటుచేసుకుని (అయోనిక్ ఎక్స్ఛేంజ్) నీటి నాణ్యత తగ్గిపోతుంది. కలుషిత భూగర్భ జల్లాలోకి పైనుంచి వచ్చిన నీరు దిగుతుంది.

ఈ నేపథ్యంలో, రేగడి మన్నుతో కూడిన డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచటానికి లోతు కాలువలు, నదులు వంటి వాటితో సహజంగా సంధానమయిన డ్రెయిన్లు మాత్రమే మార్గం.

కాబట్టి డెల్టా ప్రాంతంలో ఇంకుడు గుంతల కోసం వెచ్చించే నిధుల్ని కూడా ఎత్తయిన ప్రాంతాలకు మళ్లిస్తే అక్కడ దుష్పరిణామాలు లేకుండా ఎక్కువ గుంతల్ని ఏర్పాటు చేయవచ్చు. డెల్టా ప్రాంతాల్లోలా గుంతల లోతు మెరక ప్రాంతాల్లో ముఖ్యం కాదు.

ఇంతకుముందే చెప్పుకున్నట్టు, డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాల్ని పెంచటానికి సాగునీటి కాలువలు, ప్రకృతి సిద్ధ మురుగు పారుదల వ్యవస్థలే పరిష్కారం. ఇటువంటప్పుడు కాలువల్లో, డ్రైనేజీ వ్యవస్థల్లో ఇసుక మేటల్ని, ఇతర పూడికల్ని ఎప్పటికప్పుడు తొలగించటం, చెత్తాచెదారాల్ని వాటిలో పారేయకుండా చూడటం మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వీటిలో పూడికలు, వ్యర్థాల వల్ల భూమి పైనేకాకుండా, పైపొరలలో

కూడా నీరు కలుషితమై పంటలను దెబ్బతీస్తుంది, మనుషులకు అనారోగ్యాన్ని కలగజేస్తుంది. దీంతో, ఎండాకాలం తాగటానికి నీళ్లుండవు, వర్షాకాలం నీళ్లు తాగటానికి పనికిరాని పరిస్థితి నెలకొంటుంది. (లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తూర్పు గోదావరి కలెక్టర్‌గా ఉన్నప్పుడు బ్యూరోక్రసీ చట్రాన్ని ఛేదించి వినూత్న ఆలోచనతో ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపి ప్రపంచబ్యాంకు సాయాన్ని సాధించి జిల్లాలో సాగునీటి డ్రైనేజీని ఆధునీకరించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి కూడా ఆంధ్ర-తెలంగాణ పక్షపాతం చూపకుండా వేగంగా స్పందించి నిధులు మంజూరయ్యేలా చేశారు. ఆ తర్వాత రెండు దశాబ్దాలు దాటినా తూర్పు గోదావరిలో మురుగు పారుదల వ్యవస్థను ఆధునీకరించకపోవటంతో ఎప్పుడు అకాల వర్షం కాస్త ఎక్కువ పడినా పంట మునక, రైతులకు అపార నష్టం, రాజకీయ నేతల నాటకీయ ఆర్భాటాలు, వీలున్నప్పుడొచ్చే విపత్తు పరిశీలనా బృందాలు, ఖజానాకు కొంత భారం, అందులోనూ అవినీతి ఆనవాయితీగా మారాయి)

రూపాయి పొదుపుచేయుటమంటే రూపాయి సంపాదించటమే. ఇంకుడు గుంతల విషయంలో కావచ్చు, మరో అంశంలో కావచ్చు.. మన రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సురక్షితమైన, సంపదసృష్టి చేసే సమాజాన్ని నిర్మించేందుకు అన్ని వర్గాల ప్రజలూ (రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, పౌరులు) విజ్ఞతతో సరైన విధానాలను రూపొందించుకుని కలిసికట్టుగా కృషి చేయాలి. పరిమిత వనరులతో అపరిమిత అవసరాలను తీర్చగలగాలి. ఈ వ్యాసాన్ని ప్రజల ముందుంచటానికి అవసరమైన సమాచారాన్ని, వివరాల్ని జల రసాయనం, గోదావరి నది పశ్చిమ డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యతా ప్రమాణాలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధనా పత్రాలను సమర్పించి డాక్టరేట్‌ను పొందిన విద్యావేత్త, జియోఫిజిసిస్టు డా॥ సుంకర అప్పారావు అందించారు.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)

**- డా॥ వంకా వెంకట రాందాస్, ఎం.డి**

(తణుకు లోక్‌సత్తా విభాగం మాజీ అధ్యక్షులు)

పీపుల్స్ నర్సింగ్ హోం, తణుకు ◻

# అప్పుల కన్నా ఎఫ్‌డీఐ మేలు,

## చిన్న, మధ్యతరహాలో స్వదేశీ పెట్టుబడులనూ ప్రోత్సహించాలి: జేపీ

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంకెళ్లు తెంచటం కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా తీసుకున్న అవసరమైన నిర్ణయమని, రైతుల ఆదాయం పెంచటానికి, యువతకు ఉద్యోగాలనిచ్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎస్ఎంఈ) పెంపొందించే పెద్ద పరిశ్రమలు రావటానికి ఈ చర్య దోహదం చేస్తుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్వాగతించారు.

ఎఫ్‌డీఐతోపాటు స్వదేశీ పెట్టుబడులను, ముఖ్యంగా ఎస్ఎంఈలలో, కూడా పెద్దఎత్తున ప్రోత్సహించాలని, మనకు మౌలిక వసతులు, పరిశ్రమల రంగాల్లోకి భారీగా పెట్టుబడులు కావాల్సున్నందున విదేశీయా, స్వదేశీయా అన్న తేడా లేకుండా పెట్టుబడులను ఆకర్షించాలని జేపీ అన్నారు.


అప్పుల కన్నా ఎఫ్‌డీఐ మేలని, అయితే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన జన్మహక్కేమీ కాదని జేపీ అన్నారు. మనం అంగీకరించాం కాబట్టి కుప్పతెప్పలుగా వచ్చిపడవని, ఎఫ్‌డీఐ కోసం మిగతా ప్రపంచంలో విపరీతమైన పోటీ ఉందని అన్నారు. అందువల్ల పెట్టుబడి పెట్టటాన్ని మనం బాగా సులభతరం చేయాలన్నారు. వేగంగా పెట్టుబడులు పెట్టగలిగే వాతావరణాన్ని కల్పిస్తే స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెరిగి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇందుకోసం ఇంకా చాలా కృషి చేయాల్సి ఉందన్నారు.

ఎఫ్‌డీఐలపై రాజకీయ పార్టీలు పైకి ఒకలా, అంతర్గత సమావేశాల్లో ఇంకోలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక తీరుగా, అధికారపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించాయని.. ఈ అవకాశవాదం, ప్రతికూల రాజకీయ వాతావరణం వల్ల వ్యవసాయం, ఉపాధి నష్టపోయాయని జేపీ అన్నారు. దళారులు లేని రిటైల్ చైన్లు పెద్దసంఖ్యలో ఏర్పాటై ఉంటే రైతులకు, వినియోగదారులకు కూడా లాభం చేకూరివుండేదన్నారు.

పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా కనిపించటాన్ని మనం నిరంతరం కార్యక్రమంలా కొనసాగించాలని, 2022 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ లక్ష్యం కావాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◻

# మానవ వనరుల అభివృద్ధిలో సోదిలో లేని భారత్

నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు వంటి కీలక బాధ్యతల్ని భారత రాజకీయ వ్యవస్థ, సమాజం పట్టించుకోకపోవటం వల్ల.. అగ్రరాజ్యంగా ఎదగాలని, అమెరికా, చైనాలతో పోటీపడాలని దేశం కంటున్న కలలు నెరవేరటం ప్రశ్నార్థకమేనని ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) వెల్లడించిన 'మానవ వనరుల సూచీ-2016' వివరాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్నికలలో, పాలనలో అవి ప్రధానాంశాలు కాకపోవటం వల్ల ఆ రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతూ భారత మానవ వనరుల అభివృద్ధిని దెబ్బ తీస్తున్నాయి. మానవ వనరుల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని గుర్తించకపోవటం, తీవ్రమైన ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు తగిన ప్రయత్నాలు చేయకపోవటం, అన్నిటికంటే ముఖ్యంగా ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయటంతో ప్రపంచ స్థాయికి ఎదగాలన్న భారత్ కృషి ఆశించిన ఫలితాలనివ్వటం లేదు.



మానవ వనరుల అభివృద్ధి విషయంలో అమెరికా, ఐరోపాలతో పోలిక అంటే అవి అభివృద్ధి చెందిన దేశాలు గదా.. అని తప్పించుకోవచ్చు. కానీ దక్షిణాసియాలోని శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్‌తో పోల్చిచూసినప్పుడు కూడా భారత్ దిగదుడుపుగానే ఉంది. మొత్తం 130 దేశాల్లో 'మానవ వనరుల అభివృద్ధి ఎలా ఉంది..?' అనే అంశంపై విశ్లేషించి తయారుచేసిన నివేదికలో

## అరకొర ప్రయత్నాలు

గతంతో పోలిస్తే మనదేశంలో విద్యాప్రమాణాలు, వసతులు కొంత మెరుగుపడినా మెజారిటీ ప్రజలు ఆ పరిధిలోకి రావటం లేదు. కార్మికశక్తి విషయంలోనూ అసమానత లున్నాయి. మానవ వనరుల్ని సక్రమంగా వినియోగించుకునే పరిస్థితీ మనదేశంలో సక్రమంగా లేదు. ఇటువంటి పరిస్థితే పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలోనూ ఉంది. మనదేశం మాదిరిగానే ఆ రెండు దేశాల్లో ప్రాథమిక విద్యారంగం అధ్వాన్నంగా ఉంది. పట్టభద్రుల్లో నైపుణ్యాలు పరిమితం. ఇతర దక్షిణాసియా దేశాలతో పోలిస్తే శ్రీలంక స్థానం ఎంతో మెరుగు. విద్యావసతులపై అధిక శ్రద్ధ, ఉన్నతమైన విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలు శ్రీలంకను బలోపేతం చేశాయి. అయితే నైపుణ్యంగల విద్యావ్యవస్థ నుంచి వచ్చేవారిని సరైన శ్రామికులుగా తయారుచేసే అవకాశాలను సృష్టించటంలో శ్రీలంక విఫలమైంది. మరోపక్క దక్షిణాసియా మొత్తం ఒక ప్రాంతంగా చూస్తే, మానవ వనరుల సూచీలో మధ్యప్రాచ్యం- ఉత్తర ఆఫ్రికా (మీనా రీజియన్), సబ్ సహారన్ ఆఫ్రికా ప్రాంతం కంటే వెనకే ఉండిపోయింది.

## సొంతంగా సమస్య పరిష్కారం చేయలేరు

ప్రపంచ ఆర్థిక సదస్సు నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 35శాతం.. అంటే దాదాపు మూడోవంతు మానవ వనరుల అభివృద్ధికి దూరంగా ఉండటం గమనార్హం. సరైన విద్య, శిక్షణ లేకపోవటం, ఉద్యోగావకాశాలు పరిమితంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణాలు. పలు దేశాల్లో విద్యార్థులు చదివే చదువుకు, తదుపరి వారు చేసే ఉద్యోగాలకు, అక్కడ అవసరమైన నైపుణ్యాలకు పొంతన ఉండటం లేదని నివేదిక తేల్చింది. చదువు ఉంటోందిగానీ, వారిలో వినూత్నంగా ఆలోచించటం, పోల్చి చూడటం, సొంతంగా సమస్య పరిష్కారానికి సిద్ధపడటం వంటి నైపుణ్యాలు ఉండటం లేదు. ఇలాంటి చదువుల వల్లే చాలా దేశాల్లో విద్యారంగంపై పెట్టిన పెట్టుబడి పూర్తిస్థాయి ఫలవంతంగా లేదని కూడా ఈ నివేదిక స్పష్టంచేసింది.

# రాష్ట్ర కార్యాలయాలకు ఉత్తరాంధ్ర పనికిరాదా?

ఉత్తర కోస్తా జిల్లాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర అన్యాయం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం పార్టీ కార్యాలయంలో జరిగిన సీనియర్ నేతల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాధిపతుల కార్యాలయాలు అమరావతికి వచ్చాయని, వాటిలో ఆర్టీసీ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వంటి కొన్ని కార్యాలయాలైనా ఉత్తరాంధ్రలో ఏర్పాటైతే ప్రజలకు అందుబాటులో ఉంటాయని జనం ఆశించారని, కానీ చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో చేసిన తప్పులేే తిరిగి చేస్తూ అధికారాన్ని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తుంటే ఈ ప్రాంత మంత్రులు అచ్చెన్నాయుడు, మృణాళిని, గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు స్పందించకపోవటం విచిత్రంగా ఉందన్నారు. లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకుడు అల్లంశెట్టి నాగభూషణం మాట్లాడుతూ, అభివృద్ధి అంటే చంద్రబాబు అమరావతి అనుకుంటున్నారే తప్ప మిగిలిన జిల్లాలు ఉన్నాయనుకోవటం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు పెరుగుతున్నాయని, పాలన గాడితప్పిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ సంస్థాగత వ్యవహారాలను చర్చించారు. పార్టీ నేతలు మొల్లేటి చిన్నారావు, తేజా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ 105వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మనకంటే చిన్నదైనా శ్రీలంక 50వ స్థానంలో ఉంది. ఇంతకంటే చిన్నదేశమైన భూటాన్ 91వ స్థానంలో, బంగ్లాదేశ్ 104వ స్థానంలో ఉన్నాయి. నేపాల్, పాకిస్తాన్ 108,118 ర్యాంకుల్లో ఉన్నాయి. మనకంటే ఎక్కువ జనాభా ఉన్న చైనా 71వ స్థానంలో ఉంది.

**జనాభా వయసు అధికం అయినప్పటికీ విద్యాభ్యాసం, దీర్ఘాయువు కలిగివుండటం జపాన్‌కు కలిసివస్తున్నట్టుగా నివేదిక విశ్లేషించింది. నూరుశాతం ప్రాథమిక విద్య, యాభై శాతం ఉన్నత విద్య కలిగివుండటం జపాన్‌కు కలిసివస్తున్న అంశం.**

### చైనా ఆదర్శం

మనదేశంలోని సోషలిస్టు వాదులకు భిన్నంగా కమ్యూనిస్టు చైనాలో విద్య, ఆరోగ్యం వంటి వాటికి పెద్ద పీట వేశారు. ఫలితంగా రష్యాను మినహాయిస్తే ఇతర బ్రిక్స్ దేశాలతో పోల్చినప్పుడు కూడా చైనా ఆకర్షణీయ స్థితిలో నిలిచింది. చైనా యువజనాభా అన్ని ప్రమాణాల ప్రకారం ఉన్నతంగా కనిపిస్తోంది. ఉద్యోగుల్లో నైపుణ్యం, సాంకేతిక విద్యాభ్యాసం, ఆర్థికపరమైన అంశాల్లో సైతం చైనా మెరుగైన స్థితిలో ఉంది.

ప్రాథమిక విద్యలో నాణ్యత, నిరుద్యోగంలో నాసిరకమే ఆ సమున్నత దేశాల ప్రత్యేకత

మానవ వనరుల సూచీలో అగ్రస్థానంలో నిలిచిన దేశాల్లో విద్య, ఆరోగ్యం, ఉద్యోగితా ప్రమాణాలు ఎంతో ఉన్నతంగా ఉన్నాయి. మొదటి మూడు స్థానాల్లో ఉన్న దేశాలైన ఫిన్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాల్లో మానవ వనరుల వినియోగం ఎంతో అధికం. మానవ వనరుల అభివృద్ధి, వినియోగంలో ఫిన్లాండ్ అగ్రగామిగా ఉందని, నాణ్యమైన చదువు ఉన్న యువతే ఈ దేశానికి బలమని నివేదిక విశ్లేషించింది. మరీ ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల నాణ్యత అత్యున్నతమని, అదే ఆ దేశానికి ఉన్న ప్రత్యేకతని వివరించింది. ఉద్యోగుల్లో నైపుణ్యాలు కూడా అధికమని తెలిపింది. ఫిన్లాండ్‌లో 50-55 ఏళ్ల వయస్కులను చూసినా అత్యున్నత విద్యాప్రమాణాలు కన్పిస్తాయి. నార్వేలో 14 ఏళ్లలోపు వయసు పిల్లల్లో విద్యాప్రమాణాలు అధికం. అతి తక్కువ నిరుద్యోగం ఉండటం ఈ దేశం ప్రత్యేకత. అత్యున్నత నాణ్యత గల ప్రాథమిక పాఠశాలలు స్విట్జర్లాండ్‌లో అధికంగా ఉన్నాయి. ప్రపంచంలో స్విట్జర్లాండ్ విద్యావ్యవస్థదే అగ్రస్థానం. సాంకేతిక విద్య, నైపుణ్యాల శిక్షణ, అధిక నైపుణ్యం గల ఉద్యోగస్తులకు అవకాశాలుండటం కూడా స్విట్జర్లాండ్‌ను మానవ వనరుల సూచీలో మొదటి మూడు స్థానాల్లో ఉండేలా చేసింది. ఈ దేశాల సరసన స్థానం గల ఆసియా దేశం జపాన్. ఈ సూచీలో జపాన్ నాలుగవ స్థానంలో ఉంది. ఇదేస్థాయిలో ఉన్న ఐరోపా దేశాలకు భిన్నంగా జపాన్‌లో 55-65 ఏళ్ల వయస్కుల్లో నైపుణ్యాలు అధికంగా ఉన్నాయి. జనాభా వయసు అధికం అయినప్పటికీ విద్యాభ్యాసం, దీర్ఘాయువు కలిగివుండటం జపాన్‌కు కలిసివస్తున్నట్టుగా నివేదిక విశ్లేషించింది. నూరుశాతం ప్రాథమిక విద్య, యాభై శాతం ఉన్నత విద్య కలిగివుండటం జపాన్‌కు కలిసివస్తున్న అంశం. ◻

# సరైన విధానాలుంటేనే జయహో భారత్

- శ్రీకాంత్ రెడ్డి మారంరెడ్డి,
పీపుల్ ఎగనెస్ట్ కరప్షన్



భూ మండలంపై అత్యధిక యువశక్తి కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 10 నుంచి 24 మధ్య వయసున్నవారు మనదేశంలోనే ఎక్కువగా ఉన్నారు. ఈ వయసువారు భారత్‌లో ఏకంగా 35.6 కోట్లమంది ఉన్నారని అంచనా. జనాభాపరంగా భారత్ చైనా తరువాతి స్థానంలో ఉన్నా, యువజనం విషయానికొచ్చేసరికి మనమే ముందుండటం విశేషం.

ప్రపంచ యువజనాభాలో ఐదో వంతు భారత్‌లోనే ఉన్నారు. దేశజనాభాలో 28శాతం మంది 10 నుంచి 24 ఏళ్ల మధ్యవారే. భూమ్మీద ఈ వయసువారు 180 కోట్లమంది ఉన్నారు. యువతలో అత్యధికులు తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఉన్నారు. ప్రతి 10మందిలో తొమ్మిదిమంది ఈ దేశాల్లోనే ఉన్నారు.

యువజనం విషయంలో భారత్ తర్వాతి స్థానంలో చైనా (26.9కోట్ల మంది), ఇండొనేషియా (6.7కోట్లు), అమెరికా (6.5కోట్లు), పాకిస్తాన్ (5.9కోట్లు), నైజీరియా (5.7కోట్లు), బ్రెజిల్ (5.1కోట్లు), బంగ్లాదేశ్ (4.8కోట్లు) ఉన్నాయి.

### ఆధిపత్యం ఎక్కువకాలం ఉండకపోవచ్చు

యువతకు సంబంధించి భారత్‌కున్న ఆధిపత్యం ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. ప్రపంచ సరాసరి కన్నా చాలా వేగంగా భారత్‌లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. 2050 నాటికి ప్రపంచ జనాభాలో యువత నిష్పత్తి తక్కువగా ఉంటుందని అంచనా.

### సదుపాయాలు పెరగటం లేదు

పెరుగుతున్న యువజనానికి అనుగుణంగా చాలా దేశాల్లో మౌలిక సదుపాయాలు పెరగటం లేదు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు డిమాండ్‌కు తగినట్లుగా లేవు. ఏటా 13 కోట్ల మంది పనిచేసే వయసుకు చేరుకుంటున్నారు. వారికి సరిపడా ఉద్యోగాల సృష్టి జరగటం లేదు.

2000 నుంచి 2010 మధ్య తమ దేశానికి వెలుపలున్న విశ్వవిద్యాలయాల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 20 లక్షల నుంచి 36 లక్షలకు పెరిగింది. ఉద్యోగాలు, మెరుగైన జీవనోపాధి కోసమే ఎక్కువగా వలస వెళుతున్నారు. వలస విద్యార్థుల్లో చైనా, భారత్, దక్షిణ కొరియాలదే అధిక వాటా. విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్న దేశాల్లో అమెరికా ముందుంది. బ్రిటన్, ఆస్ట్రేలియా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

భారత్ బాల్యవివాహాల పరిస్థితిని ఈ నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. 2010లో దేశంలో బాల్య వివాహ కేసుల్లో 11మందికి మాత్రమే శిక్ష పడిందని ఐరాస నివేదిక 'ద పవర్ ఆఫ్ 1.8 బిలియన్' పేర్కొంది. ఈ దురాచారాన్ని అరికట్టటానికి న్యాయక్రియాశీలత ఒక్కటే సరిపోదని తెలిపింది.

### ప్రయోజనం

యువజనంతో అద్భుతమైన ప్రయోజనం ఉందని నివేదిక పేర్కొంది. "వారు ఆవిష్కర్తలు, సృష్టికర్తలు, నిర్మాతలు, భవిష్యత్ నేతలు. వినూత్న ఆలోచనలతో దేశాన్ని ముందుకు తీసుకెళతారు" అని నివేదిక తెలిపింది. భారత్‌కున్న యువశక్తిని పలు దేశాలు పదేపదే ప్రస్తావిస్తున్నాయి. ప్రధానమంత్రి మోదీ విదేశాల్లో ఇదే విషయాన్ని సగర్వంగా చెప్పుకుంటున్నారు.

### ఎంతో చేయాలి

యువత ఎక్కువగా ఉన్నంత మాత్రాన అభివృద్ధి వచ్చి పడదు! భారీగా యువ జనాభాను కలిగిన వర్ధమాన దేశాలు ఆర్థిక వృద్ధిని పెంపొందించుకోవచ్చని ఐరాస నివేదిక పేర్కొంది. ఆ ప్రయోజనాన్ని పొందాలంటే యువత వద్ద నైపుణ్యాలు, ఆరోగ్యం, నిర్ణయాధికారం ఉండాలి. అందుకు యువజనుల విద్య, ఆరోగ్యంపై భారీగా పెట్టుబడులు పెట్టాలని సూచించింది. వారి హక్కులను పరిరక్షించాలని చెప్పింది.

### అంతర్జాతీయ సమస్యలు

ప్రపంచంలో 50 కోట్లకు పైబడిన యువజనం రోజుకు రెండు డాలర్లకన్నా తక్కువ మొత్తంతో బతుకు బండి లాగుతోంది. నేడు 10-19 ఏళ్ల మధ్య వయసు వారిలో 20 లక్షలమంది హెచ్ఐవీతో జీవిస్తున్నారు. కొత్తగా నమోదయ్యే ప్రతి ఏడు హెచ్ఐవీ కేసుల్లో ఒకటి కౌమార వయసు వ్యక్తిదే.

2012లో 13లక్షల మంది కౌమార దశ యువత చికిత్స చేయదగ్గ వ్యాధులతో మరణించారు. 15-24 ఏళ్ల మధ్యవారిలో 16 కోట్లమందికి సరైన పోషకాహారం అందటం లేదు.

వర్ధమాన దేశాల్లో ప్రతి ముగ్గురు బాలికల్లో ఒకరు 18 ఏళ్లలోపే పెళ్లి చేసుకుంటున్నారు. ఏటా 25లక్షల మంది కౌమారదశ బాలికలు సురక్షితం కాని పద్ధతుల్లో గర్భస్రావం చేయించుకుంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా యువజనంలో 60 కోట్ల మంది కౌమార బాలికలు ఉన్నారు. వీరికి నిర్దిష్ట అవసరాలు, సవాళ్లు, ఆకాంక్షలు ఉన్నాయి. మానవవనరులపై ఎక్కువ పెట్టుబడి పెట్టటం, సరైన విధానాల ద్వారా యువతకు సాధికారత కల్పించటం అవసరం. దీనివల్ల ఆర్థిక, సామాజికవృద్ధి, తలసరి ఆదాయాల్లో పెరుగుదల కనిపిస్తాయి.

ఉద్యోగాలు, ఇతర ఆదాయార్జన అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అవసరమైన సాధనసంపత్తి కలిగినవారిగా యువజనాన్ని తీర్చిదిద్దాలి.

లింగ వివక్షను రూపుమాపడంతోపాటు కులవివక్షను పారదోలేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

బాల్యవివాహాలను, కౌమారదశలో గర్భం దాల్చే సంఘటనలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి.

సరైన విధానాలను అవలంబిస్తేనే యువ జనాభా ఈదేశానికి ఒక వరంగా మారి జయహో భారత్ కల సాకారమవుతుంది. □

## రాష్ట్రాలకు స్వేచ్ఛ కోసం సభ ద్వారా ఎన్టీఆర్ పోరు



మనదేశంలో రెండో అంచె ఫెడరలిజం, అంటే రాష్ట్రాలకు అధికారాలు పెరగటంలో కరుణానిధి, ఫరూక్ అబ్దుల్లా, బిజూ పట్నాయక్ వంటి నేతలతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు ఎంతో కృషి చేశారు. కొంత సాధించినా ఇప్పటికీ వారి కృషి అసంపూర్ణంగానే ఉంది. రాష్ట్రాలకు అవసరమైనన్ని అధికారాలు, స్వేచ్ఛ ఇవ్వకపోవటం వల్లే విద్య, ఆరోగ్యం, స్థానిక వ్యవహారాల నిర్వహణ వంటి అంశాలలో వైఫల్యం కనిపిస్తోందని లోక్‌సత్తా ఇటీవల కూడా స్పష్టంచేసింది. అందుకే, ఎన్నికలకతీతంగా తాజాగా ప్రారంభించిన లోక్‌సత్తా 2.0 కార్యాచరణలో సైతం రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత అంశాలను మొట్టమొదటి అంశంగా తీసుకుంది. ఈ పోరాటం ఫలిస్తే మూడో అంచె ఫెడరలిజం కూడా బలపడి భారతదేశం బలమైన ప్రజాస్వామిక దేశంగా విలసిల్లుతుంది. ఎన్టిరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసనసభ 'చరిత్ర పుటలు' పేరుతో ఆయన ప్రసంగాల సంకలనాన్ని పుస్తకరూపంలో విడుదల చేసింది. అందులో కేంద్రప్రభుత్వ కేంద్రీకృత పెత్తనం వల్ల రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాల్ని ఎన్టీఆర్ ఘాటుగా విమర్శించారు. 1983 జనవరి 9న మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎన్టీఆర్, మార్చి 22, 1983న అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో బలహీన ఫెడరలిజం వల్ల సమస్యల్ని ఇలా సభ ద్వారా ప్రజలముందుంచారు:

"వ్యవసాయ ధరల విధానం అసంతృప్తికరంగా ఉంది. రైతుకు గిట్టుబాటు ధరను పరిగణలోకి తీసుకోవటం లేదు. సబ్సిడీలపై హెచ్చుమొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉత్పత్తి వ్యయం, ఉత్పాతక స్థాయి, మార్కెట్ సరళి గురించి రైతు ప్రతినిధులతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిర్ణయించే పద్ధతి అవసరం. రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీ తప్పి మార్కెట్‌లో ధరలు పడిపోతే కేంద్రం రైతులకు సబ్సిడీలు అందించాలి.

భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఆటబొమ్మలుగా తయారుచేసింది. రాజ్యాంగ పద్ధతులన్నీ భ్రష్టుపరిచి రాష్ట్ర ప్రభుత్వాల్ని దద్దమ్మలుగా తయారుచేయటం దురదృష్టకరం. కరవుకాటకాలచ్చినప్పుడు ఆదుకోవాల్సిన ధర్మం కేంద్రప్రభుత్వానికి కాదా? అన్నింటినీ జానెడు గోచీలోనే ముడిపెట్టుకోవాల్సిన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికటికని సమాధానం చెబుతుంది? ఒకసారి ఆలోచించవలసిందిగా కోరుతున్నా.." □

# లోక్‌సత్తా పార్టీలో చేరిన రైతులు



రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలన వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా విమర్శించింది. వ్యవసాయం లాభసాటిగా లేక రైతులు ఉన్నకొద్దీ సంక్షోభాన్ని ఎదుర్కొంటుంటే ఉపయోగంలేని రుణమాఫీ గురించి ప్రచారం చేసుకోవటానికే ముఖ్యమంత్రి పరిమితమయ్యారని లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన తెదేపా, వైకాపా మద్దతుదారు రైతులు లోక్‌సత్తా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో పంటవిరామం ప్రకటించేందుకు రైతులు సిద్ధమవుతుంటే వ్యవసాయశాఖ కనీసం స్పందించలేదన్నారు. వ్యవసాయాన్ని వీడి ఇతర వృత్తులకు పెద్దఎత్తున వెళ్తున్న రైతులకు తగిన నైపుణ్యాలు లేక అరకొర ఆదాయంతో బతుకీడుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పరిపాలనలో మార్పు రావటం లేదన్నారు. రైతుల పేరు చెబుతూ నాయకులు పదవులు దక్కించుకుంటున్నారన్నారు. ప్రజాసేవ చేసిన చరిత్రగలవారు, ప్రజాసమస్యలు తెలిసినవారు లేకుంటే రాజకీయాలు దుర్మార్గపు నియంతృత్వంలా, దోపిడీ రాచరికంలా మారిపోతాయని అన్నారు. వీరసాగరం చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు పోటిపిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ, రైతులంటే అందరికీ చులకనగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు రొంగలి కృష్ణమనాయుడు, పెదనారం నాయుడు, చిననారం నాయుడు, సత్యం తదితరులున్నారు.

# రైలు తగలబెట్టినవారికి బెయిలు మంజూరుచేయించిన ఘనత చంద్రబాబుది





రిజర్వేషన్ల పేరుతో కులాల మధ్య చిచ్చుపెట్టకుండా, అబద్ధాలు చెప్పకుండా కాపులతోపాటు అన్ని కులాల్లోని పేదలకు ఎదిగే అవకాశాలను కల్పించే నిర్దిష్ట రిజర్వేషన్ సంస్కరణలను లోక్‌సత్తా ఇప్పటికే ప్రజల ముందుంచిందని, ఈ పరిష్కారాలను చర్చించి ఆమోదయోగ్యంగా అమలుచేయటం గురించి మాట్లాడకుండా ఇంకా చంద్రబాబు కులరాజకీయాలను రెచ్చగొడుతున్నారని బాబ్జీ ధ్వజమెత్తారు. స్వయంకృతాపరాధాల వల్ల రాష్ట్రంలో చట్టబద్ధ పాలన కూడా అందించలేని దుస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. తునిలో రైలు తగలబెట్టిన ఘటనలో కేసులు ఎదుర్కొంటున్నవారికి బెయిలు మంజూరు చేయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అలాగే కాల్‌మనీ వ్యవహారంలో భీషణ ప్రతిజ్ఞలు చేసి ఇప్పుడు కిమ్మనటం లేదన్నారు. చంద్రబాబు పాలనతీరుకు నిరసనగా విజయనగరం కలెక్టరేట్‌లో లోక్‌సత్తా పార్టీ నేతలతో కలిసి బాబ్జీ నిరసన వ్యక్తంచేశారు. హైదరాబాద్ చుట్టూ పాలనను కేంద్రీకరించి చేసిన తప్పుల్నే ఇప్పుడు కూడా చంద్రబాబు చేస్తున్నారన్నారు. అధికారాన్ని, అభివృద్ధిని వికేంద్రీకరించి, హైకోర్టు, శాసనసభ, ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. పనికిమాలిన వాళ్ల చేతుల్లో పెట్టి రాష్ట్రంలో విద్యను భ్రష్టుపట్టించారన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం గ్రీవెన్స్‌లో ఆయా అంశాలతో విజ్ఞాపన పత్రం అందచేశారు.

# అంకెల గారడీలోనూ కనిపించని ప్రయివేటు పెట్టుబడులు



దేశీయ మౌలిక సదుపాయాల రంగంలోకి 2015లో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారుగానీ, క్షేత్రస్థాయిలో ఆ జాడలు కనిపించటం లేదు. ఈ అంకెల గారడీకి తోడు, వచ్చిన కాసిని వాస్తవ పెట్టుబడుల్లో కూడా ప్రభుత్వ పెట్టుబడులే ఎక్కువగా ఉన్నాయని, ప్రయివేటు మదుపు కేవలం 41శాతం మాత్రమే ఉందని అంచనాలు సూచిస్తున్నాయి.

ప్రయివేటు పెట్టుబడులు తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే పరిణామమని అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) పేర్కొంది. 'భారత్‌లో మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులపై విశ్లేషణ' పేరుతో తయారుచేసిన నివేదికను ఇటీవల అసోచామ్ విడుదల చేసింది.

భారత మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 10శాతానికి పైగా పెరిగాయి. గత ఏడాదిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆకర్షించిన మొత్తం పెట్టుబడుల్లో 12శాతం వాటాతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో ఉన్నాయి. అయితే ఈ మొత్తం పెట్టుబడుల్లో ప్రభుత్వ వాటాయే ఎక్కువగా 59శాతం మేర ఉందని, ప్రభుత్వం ప్రయివేటురంగం నుంచి పెట్టుబడులు పెరగాలని కోరుకొంటోందని అసోచామ్ సెక్రటరీ జనరల్ అన్నారు.

ప్రతిపాదనలతో పోలిస్తే వాస్తవంగా వచ్చిన పెట్టుబడులు తెలంగాణలో 12.6శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 9.1శాతం ఉన్నాయి.

**అమల్లో జాప్యం**

పర్యావరణ అనుమతులు, స్థల సేకరణ, ఆర్థిక వనరులు వంటి వాటిల్లో సమస్యలతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ముఖ్యంగా రవాణా రంగంలోని దాదాపు 1702 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉండగా.. 832 ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతోంది. దీనివల్ల వ్యయం కూడా పెరుగుతోంది. తెలంగాణలో వ్యయ పెరుగుదల రేటు 88.9శాతం ఉన్నట్టు అసోచామ్ వెల్లడించింది. ◻

# ప్రలోభాలు లేకుండా ఓటు వేస్తేనే నిజమైన నాయకత్వం, సుపరిపాలన

పాలకులు దళితుల హక్కుల్ని కాలరాస్తున్నారని, ఎటువంటి ప్రలోభాలకూ లోనుకాకుండా నిస్వార్థంగా ఓటు వేస్తేనే నిజమైన నాయకత్వాన్ని, సుపరిపాలనను సాధించుకోగలమని లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండల కేంద్రంలో దళిత, ఆదివాసీ హక్కుల సాధనకు జిల్లా దళిత సంఘాల సమన్వయకర్త ఆతవ ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36 గంటల దీక్ష విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు. తహసీల్దార్ ఎం. అరుణకుమారి, దళిత నాయకుడు ఆదాడ మోహన్‌రావు, మామిడి అప్పలనాయుడు తదితరులతో కలిసి దీక్షాశిబిరంలో పాల్గన్నవారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. అనంతరం నేతలంతా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు.

# కాంబోడియా పోలీసు స్ఫూర్తి

***2010లో ఎక్కడో ఢిల్లీలో వాళ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిపై ఏదో ఆరోపణ వచ్చిందని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి స్వయంగా ఆందోళనకు దిగి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి మరీ రాస్తారోకో చేసినప్పుడు.. ఆయన్ను ఎందుకు అరెస్టు చేయలేదు? అని అక్కడున్న సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానమే నిర్ద్వంద్వంగా చెబుతూ, ముఖ్యమంత్రిని అరెస్టు చేసి ఉండాల్సిందని నాడు జేపీ అన్న మాటలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలను ఆలోచింపచేశాయి.***



ఆధునిక ప్రజాస్వామిక యుగంలో ప్రభుత్వాలు చేయాల్సిన మొట్టమొదటి పని చట్టబద్ధ పాలన. శాంతిభద్రతల్ని, న్యాయాన్ని పరిరక్షించే క్రమంలో చట్టం ముందు అందరూ సమానమే అన్నట్టు వ్యవహరించకపోతే మొక్కుబడిగా తప్ప నిజమైన ప్రజాస్వామ్యం ఉన్నట్టు కాదు. ఈ మాటను లోక్‌సత్తా తరచూ చెబుతుంది. 2010లో ఎక్కడో ఢిల్లీలో వాళ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిపై ఏదో ఆరోపణ వచ్చిందని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి స్వయంగా ఆందోళనకు దిగి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి మరీ రాస్తారోకో చేసినప్పుడు.. ఆయన్ను ఎందుకు అరెస్టు చేయలేదు? అని అక్కడున్న సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానమే నిర్ద్వంద్వంగా చెబుతూ, ముఖ్యమంత్రిని అరెస్టు చేసి ఉండాల్సిందని నాడు జేపీ అన్న మాటలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలను ఆలోచింపచేశాయి. కానీ ఆ ఆలోచన ఓటుగా మారకపోవటంతో 2014లో రాష్ట్రం విడిపోయాక కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు 'ఓటుకు కోట్లు కుంభకోణం'లో 'నీ పోలీసు, నా పోలీసు.. నీ ఏసీబీ, నా ఏసీబీ' అని నియంతృత్వం, రాచరికంలో కంటే హీనంగా బరితెగించి తిట్టుకున్నారు. ఇంకా సిగ్గుచేటైన విషయమేమంటే, స్వార్థ ప్రయోజనాల కోసం రాజీపడి నువ్వు అమరావతి చక్రవర్తివి, నేను హైదరాబాద్ చక్రవర్తిని అంటూ ఆ తర్వాత అదే కేసుపై రాజీపడిపోయారు. కొన్ని అరుదైన ఉదాహరణలు మినహాయించి జాతీయస్థాయిలో కూడా ఇదే తరహాలో పోలీసు, దర్యాప్తు వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకునే అప్రజాస్వామిక సంస్కృతే కొనసాగుతోంది. పాటియాల కోర్టులో విశ్వవిద్యాలయ విద్యార్థులపై న్యాయవాదుల దాడిలో పోలీసుల వ్యవహారశైలి ఇంకా అందరి మనసుల్లో తాజాగానే ఉండి ఉంటుంది. ఇలాంటి దశలో.. చట్టబద్ధ పాలనలో మనకంటే అధ్వాన్న ర్యాంకులో ఉన్న ఓ చిన్న దేశం కాంబోడియాలో ఇటీవల ఒక ట్రాఫిక్ పోలీసు చూపిన నిబద్ధత మనకు స్ఫూర్తినిస్తోంది. శిరస్త్రాణం పెట్టుకోకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించినందుకు ఏకంగా దేశ ప్రధానికే ఆయన జరిమానా విధించారు. ఈ విషయాన్ని స్వయంగా ఆ ప్రధానమంత్రే తన ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించటం ఇంకో విశేషం. కోహ్ కాంగ్ ప్రావిన్సులో ప్రయాణించిన ప్రధాని సేన్.. ప్రే అంబెల్ జిల్లాలో ఓ ద్విచక్రవాహన ట్యాక్సీని చూసి ముచ్చటపడ్డారు. దానిపై దాదాపు 250 మీటర్ల దూరం ప్రయాణించారు. శిరస్త్రాణం పెట్టుకోకపోవటంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసు 15వేల రియోల్ జరిమానా విధించారు. శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణించటంపై ప్రధాని సేన్ ప్రజలను క్షమాపణ కోరారు. □






సుమారు దశాబ్దకాలం తర్వాత జాతీయ మహిళా విధానం ముసాయిదాపై అభిప్రాయ సేకరణకు జాతీయ మహిళా కమిషన్ ఇటీవల హైదరాబాద్ వచ్చినప్పుడు లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ప్రతినిధులు కలిసి అభిప్రాయాలను వివరించారు. మహిళల భద్రతకు లోక్‌సత్తా కృషితో వచ్చిన స్థానిక కోర్టులను ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించటం, చట్టసభలలో మహిళా రిజర్వేషన్‌కు లోక్‌సత్తా రూపొందించిన ప్రత్యామ్నాయ బిల్లు, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలలో సంస్కరణల ద్వారా మహిళా సాధికారత తదితర అంశాలను ఈ ప్రతినిధులు మహిళా కమిషన్‌కు వివరించారు.

మరోవైపు, దక్షిణాది ప్రాంతీయ సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినా తెలంగాణ మంత్రివర్గంలో ఒక్క మహిళ కూడా లేకపోవటాన్ని మహిళా కమిషన్ చర్చించకపోవటాన్ని లోక్‌సత్తా పార్టీ తప్పు పట్టింది. స్థానిక కోర్టులను ఏర్పాటు చేస్తే చిన్న నేరాలకు వేగంగా శిక్షలు పడి వేధింపుల దశలోనే మహిళలపై అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుందని, కానీ ఇంతవరకూ తెలుగు రాష్ట్రాలు స్థానిక కోర్టుల ఏర్పాటుకు ముందుకురావటం లేదని విమర్శించింది. మహిళలకు చట్టాల గురించి కనీస అవగాహన లేకపోవటం వల్ల హింసను భరిస్తున్నారని, వివక్ష, వేధింపులకు వ్యతిరేకంగా మహిళల్లోను, పురుషుల్లోనూ బాల్యం నుంచి అవగాహన పెంచటానికి మహిళా కమిషన్ సమగ్ర కార్యక్రమం చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ సూచించింది.

Posting Date 22-07-2016

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July16th 2016




**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad